తెలంగాణ

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం-08- జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 221 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in





## రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. 20 మంది అధికారులను ఇతర ప్రదేశాలకు మారుస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వాటితో పాటు నాలుగు కమిషనరేట్ల పరిధిలోని డీసీపీలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వారి వివరాలు.. చేవేళ్ల డీసీపీగా యోగేష్, కూకట్‌పల్లి డీసీపీగా రీతిరాజ్, శేరిలింగంపల్లి డీసీపీగా చింతమనేని శ్రీనివాస్, బేగంపేట డీసీపీగా రక్షితామూర్తి, రాజేంద్రనగర్ డీసీపీగా శ్రీనివాస్, ఉప్పల్ డీసీపీగా సురేష్, సిద్ధిపేట సీపీగా రష్మీ పెరుమాళ్, హైదరాబాద్ ఎస్పీ డీసీపీగా విజయ్ కుమార్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు ముమ్మరమైన కసరత్తు

- రిజర్వేషన్లు ఖరారైన తర్వాతే నోటిఫికేషన్
- ఎన్నికల పరిధిలోకి 117 మున్సిపాల్టీలు, 6 కార్పొరేషన్లు
- జీహెచ్ఎంసీ, నాలుగు మున్సిపాల్టీలకు మినహాయింపు
- వార్డులు–డివిజన్ల రిజర్వేషన్లపై కసరత్తు
- ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల – అభ్యంతరాల పరిశీలన
- ఈనెల 12న తుది ఓటర్ల జాబితా
- 20న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవకాశం
- ఫిబ్రవరి రెండో వారంలో ఎన్నికల నిర్వహణ
- ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ
- మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు
- ఎన్నికల ఏర్పాట్లపై అధికారులకు కమిషనర్ ఆదేశాలు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. రిజర్వేషన్లు ఖరారైన తర్వాతే నోటిఫికేషన్ విడుదల కానుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే రంగంలోకి దిగడంతో పురపాలకశాఖ అధికారులు కూడా వేగం పెంచారు.

మిగతా 2లో



# సంక్రాంతికి 6,431 ప్రత్యేక బస్సులు

### టీజీఎస్ఆర్టీసీ పూర్తి ఏర్పాట్లు

- సంక్రాంతికి ప్రత్యేక బస్సుల నిర్వహణకు ఆర్టీసీ సన్నాహాలు
- హైదరాబాద్ రద్దీ ప్రాంతాల నుంచి స్పెషల్ సర్వీసులు
- పండుగ రోజుల్లో మాత్రమే 1.5 రెట్లు టికెట్ చార్జీలు
- మహిళలకు ఉచిత ప్రయాణం, ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం

2లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు పెంపు

### ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు పెంపు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు): అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ దూకుడు పెంచింది. ఈ వ్యవహారంలో బాధితులతో పాటు రాజకీయ నాయకులు, వారి సంబంధీకుల నుంచీ వాంగ్మూలాలు సేకరిస్తోంది. ఇందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి కూడా బుధవారం నోటీసులు జారీ చేసింది. గురువారం ఉదయం 11కి సిట్ కార్యాలయానికి వచ్చి వాంగ్మూలం ఇవ్వాల్సిందిగా కోరింది. మరోపక్క బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, జైపాల్ యాదవ్‌లతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్ రావు, ఎమ్మెల్సీ నవీన్‌రావు తండ్రి కొండల్‌రావు తదితరులనూ నోటీసులు ఇచ్చింది.

మిగతా 2లో





## సంక్రాంతికి 'సెలబ్రేట్ ది స్కై' వేడుకలు

### జూపల్లి కృష్ణారావు

- పర్యాటక రంగంలో పెట్టుబడులకు రాయితీలు, పీపీపీ విధానం
- పరేడ్ గ్రౌండ్‌లో కైట్ ఫెస్టివల్, స్వీట్ ఫెస్టివల్ నిర్వహణ

2లో



## వీధికుక్కల నియంత్రణపై సుప్రీంకోర్టులో కీలక వాదనలు

- జాతీయ రహదారుల భద్రతపై ధర్మాసనం ఆందోళన
- హైదరాబాద్ తరపున సీనియర్ న్యాయవాది వేణుగోపాల్ వాదనలు
- జంతు న్యాయ కేంద్రం, హార్వర్డ్‌తో అవగాహన ఒప్పందం ప్రస్తావన
- దేశవ్యాప్తంగా కుక్కల జనాభా, ఆశ్రయ అవసరాల గణాంకాలు
- చట్టబద్ధ నియమాల సవరణ లేకుండా కోర్టు జోక్యం సాధ్యం కాదన్న వాదన
- నిపుణుల కమిటీ ఏర్పాటు ప్రతిపాదన

8లో

# మున్సిపాలిటీల బాధ్యత ఇస్తే అభివృద్ధి చూపిస్తాం

- జమ్మికుంటలో సింథటిక్ ట్రాక్‌కు రూ.6.5 కోట్ల మంజూరు
- కళాశాల స్థల సమస్యలపై అధికారులతో చర్చ
- అమృత్ పథకంలో జమ్మికుంట రైల్వే స్టేషన్ అభివృద్ధి హామీ
- ఆసుపత్రులు, కుల సంఘాలకు కేంద్ర నిధులు
- మున్సిపాలిటీ బాధ్యత ఇస్తే సంపూర్ణ అభివృద్ధి చేస్తామన్న బండి సంజయ్



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు): హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలను బీజేపీకి అప్పగిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం జమ్మికుంట డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి 6.5 కోట్ల నిధులు మంజూరు చేసింది.

మిగతా 2లో



## విద్యా వ్యవస్థపై దాడి: హరీష్‌రావు

- విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్న ఆరోపణ
- యూనివర్సిటీల భూములపై ప్రభుత్వం కన్ను
- పరిశోధనా కేంద్రాల ధ్వంసంపై ఆగ్రహం
- పర్యావరణం, మూగజీవాల మనుగడకు ముప్పు
- చర్యలు ఆపకపోతే తీవ్ర ప్రతిఘటన హెచ్చరిక

2లో

## కాంగ్రెస్ పాలనకు కౌంట్‌డౌన్ మొదలైంది: కేటీఆర్

- కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో బీఆర్ఎస్ ధీమా
- యూరియా కొరతపై రైతుల ఆవేదన ప్రస్తావన
- గ్యారెంటీలు అమలు కాలేదన్న ఆరోపణ
- ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ ఓటమి ఖాయం అంటూ వ్యాఖ్యలు

2లో









తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు ముమ్మరమైన కసరత్తు


(మొదటి పేజీ తరువాయి)



జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మొత్తం ఎన్నికల పర్వంలో రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకం కావడంతో అధికారులు దీనిని సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో గడువు ముగిసిన 117 మున్సిపాల్టీలు, 6 కార్పొరేషన్ల ఎన్నికలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే.
ఇంకా గడువు ముగియని 4 మున్సిపాల్టీల తోపాటు జీహెచ్ఎంసీని కూడా ప్రస్తుత ఎన్నికల నుంచి మినహాయించారు. బాహ్య వలయ రహదారి పరిధిలోని మున్సిపాల్టీలను విలీనం చేయడం వల్ల జీహెచ్ఎంసీ పరిధి పెరగగా దీన్ని మూడుగా విభజించాలన్న ప్రతిపాదన నేపథ్యంలోనే ఇక్కడ కూడా ఎన్నికలు వాయిదా వేశారు. దాంతో మిగతా పట్టణ స్థానిక సంస్థల్లో తుది ఓటర్ల జాబితా సిద్ధం చేసే పని మొదలైంది. ఈ నెల ఒకటో తేదీనే ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించగా ప్రస్తుతం అభ్యంతరాల పరిశీలన పనులు నడుస్తున్నాయి. ఈనెల 12న తుది జాబితా ప్రచురించనున్నారు. 20న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని భావిస్తున్నారు. ప్రభుత్వం దీనిపై ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు ఫిబ్రవరి రెండో వారంలో నిర్వహించే అవకాశం ఉంది.
2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను, రాష్ట్రంలో కులగణన కోసం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ ప్రతిపాదనల ఆధారంగా బీసీ రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా తక్కువగా ఉంటుంది. మొత్తం జనాభాలో వీరి వాటా ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. ఇది పూర్తయిన తర్వాత బీసీ రిజర్వేషన్లు పూర్తిచేస్తారు. 2020లో జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 13.82 శాతం ఎస్సీలు, 3.25 శాతం ఎస్టీలు, 32.52 శాతం బీసీ జనాభా ఉన్నట్లు గుర్తించి దాని ఆధారంగానే రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఎస్సీ, ఎస్టీలకు నిర్ణయించాక మిగతా వాటిని మొత్తం రిజర్వేషన్లు 50% పరిమితికి లోబడి బీసీలకు కేటాయిస్తారు. మొత్తం స్థానాల్లో 50% మహిళలకు కేటాయించనున్నారు. రిజర్వేషన్ ప్రకారం ఏ సామాజిక వర్గానికి కేటాయించినప్పటికీ అందులో సగం స్థానాలు మళ్లీ మహిళలకే దక్కుతాయి.
మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపాల్టీ, కార్పొరేషన్ల కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 12న తుది ఓటర్ల జాబితా, 13న పోలింగ్ స్టేషన్ల వివరాల ముసాయిదా జాబితా ప్రచురించి వాటిని ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టిపోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. 16న పోలింగ్ స్టేషన్ల వివరాలతోపాటు ఫొటోతో కూడిన ఓటర్ల తుది జాబితా ఆయా వార్డుల్లోని పోలింగ్ స్టేషన్ల వారీగా ప్రచురించాలని ఆమె స్పష్టం చేశారు. అవసరమైన బ్యాలెట్ బాక్సుల అంచనా, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్, జోనల్ అధికారుల నియామకానికి ఉద్యోగుల వివరాలను టిపోల్‌లో అప్‌డేట్ చేయాలని రాణి కుముదిని ఆదేశించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు పెంపు

(మొదటి పేజీ తరువాయి)



ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ 16న సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఆ రోజు నివేదిక సమర్పించాల్సి ఉండటంతో సిట్ వేగం పెంచింది. ప్రభాకర్‌రావు 2023 ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబీకులు, సంబంధీకులు, అనుచరులపై నిఘా ఉంచారని, దీనికోసం ప్రత్యేకంగా 'ఆర్ఆర్ మాడ్యూల్'పేరుతో ఓ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అప్పట్లో ఎస్ఐబీలోని స్పెషల్ ఆపరేషన్ టీమ్‌కు (ఎస్వోటీ) నేతృత్వం వహించిన డీఎస్పీ డి.ప్రణీత్‌రావు దీన్ని పర్యవేక్షించారు. ప్రభాకర్‌రావు హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా అనేక మంది ఫోన్లు ట్యాప్ అయ్యాయని, వీరిలో సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు వ్యాపారవేత్తలు, బిల్డర్లు, రియల్టర్లు కూడా ఉన్నారని సిట్ చెబుతోంది. ఈ క్రమంలోనే వారికి వచ్చే ఫోన్ కాల్స్, ఎస్సెమ్మెస్ తదితరాలను పర్యవేక్షించడానికి కొందరు ఎస్ఐబీ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు.
ఇందులో భాగంగానే రేవంత్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు కొండల్‌రెడ్డి సహా మరికొందరు నంబర్లు కలిపి ఏర్పాటు చేసిన మాడ్యూల్‌కు ప్రభాకర్‌రావు 'ఆర్ఆర్ మాడ్యుల్'అనే పేరు పెట్టినట్లు తెలుస్తోంది. ఈ విధంగా ఏర్పాటు చేసిన మాడ్యూళ్లలో ఉన్న వారి ఫోన్లను సర్వకాల సర్వావస్థల్లోనూ పర్యవేక్షిస్తూ ఉండటానికి డీఎస్పీ ప్రణీత్‌రావు నేతృత్వంలో 20 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో కొందరు అత్యాధునిక ఉపకరణాలతో రేవంత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి ఇళ్ల సమీపంలో తాత్కాలిక వార్‌రూమ్స్ ఏర్పాటు చేసుకుని పర్యవేక్షించినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే కొండల్‌రెడ్డికి సిట్ నోటీసులు జారీ చేసింది.

# సంక్రాంతికి 6,431 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):
సంక్రాంతి నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ ఏడాది సంక్రాంతికి పండుగకు 6431 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం ఇప్పటికే నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9, 10, 12, 13 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 18, 19 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్‌లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్బీ, బోయిన్పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.5 రేట్ల వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ప్రధాన పండుగకు 1.5 రేట్ల వరకు టికెట్ ధరలను ఉమ్మడి కార్పొరేషన్‌గా ఉన్నప్పటి నుండి అమలు చేస్తుంది. టీజిఎస్ఆర్టీసీ ఏర్పడిన నాటి నుండి ప్రతి ప్రధాన పండుగకు దీన్ని అమలు చేస్తుంది.
ఈ సంక్రాంతి పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 రేట్లు వరకు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 9, 10, 12,13 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 18, 19 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి. స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుంది. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను www.tgsrtcbus.in వెబ్ సైట్‌లో బుక్ చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. సంక్రాంతి ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 04069440000, 04023450033 లలో సంప్రదించాలని సూచించింది.




# సంక్రాంతికి 'సెలబ్రేట్ ది స్కై' వేడుకలు

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):
సంక్రాంతి నేపథ్యంలో అంతర్జాతీయ పతంగుల పండగ, స్వీట్ ఫెస్టివల్, హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్, డ్రోన్ షోలను నిర్వహిస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సెలబ్రేట్ ది స్కై పేరుతో సంక్రాంతి సంబురాలు జరుగుతాయని తెలిపారు. బుధవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు ఆకర్షించేందుకు రాయితీలు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పీపీపీ విధానంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, టూరిజం కాన్క్లేవ్, గ్లోబల్ సమిట్ ద్వారా రూ.22,324 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా సుమారు 90వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యమన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జనవరి 13 నుంచి 15 వరకు నిర్వహించే అంతర్జాతీయ పతంగుల పండగలో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, దేశంలోని 15 రాష్ట్రాలకు చెందిన 55 జాతీయ కైట్ ఫ్లయర్స్ పాల్గొంటారని తెలిపారు. పతంగుల పండుగ సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో స్వీట్ ఫెస్టివల్, చేనేత హస్తకళల ప్రదర్శన ఉంటుందన్నారు.




# కాంగ్రెస్ పాలనకు కౌంట్‌డౌన్ మొదలైంది: కేటీఆర్

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):
ఎగవేతలు, కూల్చివేతలతో కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని.. అందుకే ఆ పార్టీని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ఖమ్మంలో బుధవారం నిర్వహించిన నూతన సర్పంచ్‌ల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తారు.
క్వార్టర్ ఫైనల్‌లో(సర్పంచ్ ఎన్నికలను ఉద్దేశించి..) మంచి ఫలితాలు వచ్చాయి. సెమీ ఫైనల్‌లో మంచి ఫలితాలు వస్తాయి. చివరికి ఫైనల్‌లో విజయం మనదే. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. యూరియా బస్తాలు దొరకడం లేదని రైతన్నలు చెబుతున్నారు. పాలిచ్చే గేదెను వదులుకొని.. తన్నే దున్నపోతు ను గెలిపించారని నేను వారితో చెప్పా. అయిపోయింది ఏదో అయిపోయింది.. వచ్చేది బీఆర్ఎస్ అని రైతులు నాతో చెప్పారు. రైతులు ఎంత క్లారిటీగా ఉన్నారో అర్థమైంది.
బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో యూరియా కష్టాల్లేవ్. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే లైన్‌లలో చెప్పులు కనిపిస్తున్నాయి. షాపుల్లో లేని యూరియా యాప్‌ల్లో ఎలా వస్తుంది?.. కాంగ్రెస్ పాలనలో ఎగవేతలు, కూల్చివేతలు. లక్ష కోట్ల బడ్జెట్ అన్నారు.. ఏమైంది?. కౌలు రైతులకు ఇస్తామన్న డబ్బులు ఇచ్చారా?. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చారా?. రెండేళ్లలో ఏం అభివృద్ధి జరిగింది?.. కూల్చివేతలు, ఎగవేతలే కనిపిస్తున్నాయి. ఇది సర్వభ్రష్ట ప్రభుత్వం.. ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలని కేసీఆర్ పని చేశారు. ఇప్పుడు ఇదే జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నారు. కనీసం రైతులకు యూరియా ఇప్పించలేని పరిస్థితిలో ఉన్నారు. కమీషన్ల కోసమే ఆ మగ్గురు పని చేసేది. 30 శాతం ట్యాక్స్ నడిపిస్తున్నారు వాళ్లు. ఆరు గ్యారెంటీలు భద్రంగా పెట్టుకోండని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆనాడు ఎన్నికల ప్రచారం లో చెప్పారు. ఇప్పుడు రెండేళ్లు అయిన గ్యారెంటీలు అమలు కాలేదు. దీనికి భట్టి ఏమి సమాధానం చెబుతారు?..
ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ ఓటమికి రంగం సిద్ధమైంది. సర్పంచ్ ఎన్నికల్లో 40 శాతం పదవులు గెలుచుకున్నాం. ఇక్కడే రెండేళ్లలోనే ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత వచ్చిందో తెలుస్తోంది. త్వరలో జగరబోయే కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి తప్పదు. ఖమ్మం



# విద్యా వ్యవస్థపై దాడి: హరీష్‌రావు



హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):
తెలంగాణలో విద్యా వ్యవస్థను, విశ్వవిద్యాలయాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. చదువులకు నిలయమైన యూనివర్సిటీలను లాక్కొని రియల్ దందా చేస్తూ, భావితరాల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నారని ట్విటర్ వేదికలో మండిపడ్డారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రతిష్టాత్మక యూనివర్సిటీల భూములను టార్గెట్ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి అంటే భవనాలు కట్టడం కాదు. భావితరాలకు జ్ఞానాన్ని అందించే పరిశోధనా కేంద్రాలని అన్నారు. వాటిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.
మొన్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి బలవంతంగా 100 ఎకరాలకు పైగా భూములను లాక్కున్నారు. 60 ఏళ్లుగా ఎంతో కష్టపడి కాపాడుకుంటూ వస్తున్న ఔషధ, సుగంధ మొక్కల పరిశోధనా కేంద్రం లోని 60 ఎకరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. ఎంతో విలువైన పరిశోధనా సంపద నేలమట్టమైంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాలకు పైగా అటవీ భూమిని తాకట్టుపెట్టి విధ్వంసం చేశారు. దీనివల్ల అక్కడి పర్యావరణ వ్యవస్థ చిన్నాభిన్నం కావడమే కాకుండా, మూగ జీవాల మనుగడకే ముప్పు వాటిల్లిందని వెల్లడించారు. తాజాగా మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయానికి చెందిన 50 ఎకరాలపై ప్రభుత్వం కన్ను పడిందని , అదే పద్ధతిలో ఇక్కడి భూములను కూడా లాక్కోవాలని చూస్తోందని
ఆరోపించారు.
ఇవి యాధృచ్చికంగా జరిగిన సంఘటనలు కావని, విద్యా వ్యవస్థపై, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిపై జరుగుతున్న ఉద్దేశపూర్వక దాడి అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విద్యార్థులన్నా, పరిశోధనలన్నా, పర్యావరణమన్నా ఎందుకింత చిన్నచూపు అని ప్రశ్నించారు. భవిష్యత్ తరాలకు జ్ఞానాన్ని అందించాల్సిన చోట, ఆవిష్కరణలకు ఊపిరి పోయాల్సిన చోట, భూములను లాక్కోవడం దేనికి సంకేతమని అన్నారు .
విద్యా సంస్థల భూములను కూడా రియల్ ఎస్టేట్ వెంచర్లలా చూస్తారా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.తెలంగాణ భవిష్యత్తును నిర్మించాల్సింది పోయి, ఉన్న విజ్ఞాన కేంద్రాలను బుల్డోజర్లతో కూల్చడం సిగ్గుచేటని హరీష్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ చర్యలను ఆపాలని, యూనివర్సిటీల భూములను వాటికే వదిలేయాలని, లేదంటే విద్యార్థి లోకం, తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

# మున్సిపాలిటీల బాధ్యత ఇస్తే అభివృద్ధి చూపిస్తాం

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కళాశాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, మున్సిపాలిటీల్లో బీజేపీ అధికారంలో లేకపోయినా కేంద్రం నుంచి ప్రత్యేకంగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను అమృత్ పథకంలో చేర్చి కరీంనగర్ తరహాలో అభివృద్ధి చేయబోతున్నామని తెలిపారు. సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందితో సమావేశమయ్యారు. వారి సూచనలను తీసుకున్నారు. కళాశాలకు సబంధిచిన కొంత స్థలం కబ్జాకు గురైందని, ఆ స్థలాన్ని తిరిగి అప్పగించాలని ప్రిన్సిపాల్, సిబ్బంది కోరారు. అనంతరం బండి సంజయ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ జమ్మికుంటలో సింథటిక్ ట్రాక్ నిర్మించాలని గతంలో అనేక ప్రతిపాదనలు వచ్చాయని, దీంతో కేంద్ర మంత్రి మన్సుక్ మాండవీయను కలిసి ఆ ప్రతిపాదనలు అందజేశామన్నారు. ఆయన 6.5 కోట్ల రూపాయలు మంజూరు చేశారన్నారు. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామనపి తెలిపారు. వెంటనే టెండర్ నిర్వహించి పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ వ్యక్తుల స్థలాల జోలికి ఎవరైనా వస్తే ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. జమ్మికుంట, హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు మూడు కోట్ల విలువైన పరికరాలు అందజేశామన్నారు. వీటితోపాటు నియోజకవర్గంలో అనేక కుల సంఘాలకు, గుడి కోసం, బడి కోసం నిధులిచ్చామని తెలిపారు. జమ్మికుంట పేరుకే మున్సిపాలిటీగా ఉందని, ఎటువంటి అభివృద్ధి జరగలేదని, వర్షాలొస్తే పలు కాలనీలు మునిగిపోతున్నాయన్నారు. అభివృద్ధికి సహకరించే వారు లేరని, కనీసం ప్రతిపాదనలు పంపే వారు కూడా లేరని అన్నారు. జమ్మికుంట మున్సిపాలిటీని బీజేపీకి అప్పగిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్ర మంత్రిగా కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని తెలిపారు. కరీంనగర్ తరహాలో జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను అమృత్ పథకంలో చేర్చి ఎయిర్ పోర్టు తరహాలో తీర్చిదిద్దుతామన్నారు. నాయిని చెరువును పర్యాటక ప్రాంతంగా మారుస్తామని హామీ ఇచ్చారు. అద్దెకు ఉండేవారి కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే.. యజమానులు ఇంట్లోకి రానివ్వడం లేదని, దీంతో వాళ్లు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ అంశంపై కలెక్టర్, ఆర్డీవోతో మాట్లాడుతానని, వారు స్థలం ఇస్తే ఎంపీ నిధులతో భవన సముదాయాన్ని నిర్మిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు ఆకుల రాజేందర్, రఘు పాల్గొన్నారు.



## పామిరెడ్డిపల్లిలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**పెద్దమందడి,జనవరి7(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని గ్రామ సర్పంచ్ మధిర మంజుల తెలిపారు. గ్రామ సర్పంచ్ మధిర మంజుల ,ఉపసర్పంచ్ పానుగంటి రాములమ్మ ఆధ్వర్యంలో, మానస క్లినిక్ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఈ వైద్య శిబిరానికి దాదాపు 60 మంది హాజరయ్యారు. వైద్యులు వారికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొని శిబిర సేవలను వినియోగించుకున్నారు.ఈ కార్యక్రమంలో గైనకాలజీ మరియు శిశు వైద్య నిపుణురాలు డాక్టర్ రష్మి, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, సహాయక నర్సు కౌసల్య, అంగన్వాడీ టీచర్ సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.



## వనపర్తి జిల్లా నూతన ఎస్పీ సునీత రెడ్డిని కలిసిన గిరిజన సేవా సంఘం

**వనపర్తి,జనవరి7(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లాకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ఎస్పి సునీత రెడ్డి ని వనపర్తి జిల్లా గిరిజన సేవా సంఘం అధ్యక్షులు శ్రీ ఎం. చంద్రనాయక్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా జిల్లాలోని గిరిజన తండాల్లో ఎదురవుతున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తామని సంఘం నాయకులు పేర్కొనగా, ఎస్పీ సునీత రెడ్డి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజనుల భద్రత, సంక్షేమానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ సహకరిస్తుందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారు జాతురు నాయక్, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు శంకర్ నాయక్, మాజీ జిల్లా పరిషత్ సభ్యులు ధర్మానాయక్, సర్పంచ్ కిషోర్ నాయక్, సంఘం నాయకులు శివ నాయక్, అంగోత్ రాంజీ నాయక్, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, జానికి రామ్ నాయక్, మోహన్ నాయక్, బంజారా యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పొలంలో గుర్తుతెలియని మృతదేహం

**హసన్ పర్తి,జనవరి 07(తెలంగాణ ముచ్చట్లు):**

హసన్ పర్తి మండలం అనంతసాగర్ గ్రామ శివారులో బుధవారం రోజున గుర్తుతెలియని శవం లభ్యమైనట్లు హసన్ పర్తి ఇన్స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు. వివరాల్లోకి వెళితే అనంతసాగర్ గ్రామ శివారులోని వట్టే వెంకటరమణారెడ్డి కౌలుకు చేస్తున్న పొలంలో మగ వ్యక్తి చనిపోయి ఉన్నట్లు గుర్తించామని ఇన్స్పెక్టర్ తెలియజేశారు.ఆ వ్యక్తి నలుపు రంగు కోల మొహం కలిగి 4045 సంవత్సరాలు ఉండవచ్చునని ఎడమ వైపు ఛాతిపై పుట్టుమచ్చ,నలుపు తెలుపు రంగు జుట్టు, ఎరుపు నలుపు తెలుపు రంగుల గల్లల అంగి, కుడి చేతికి చిన్న పూసల దండ,



ఎడమ చేయికి నలుపు దారం కలిగి ఉన్నాడని, ప్రాథమిక దర్యాప్తులో అనంతసాగర్ గ్రామస్తులు చెప్పిన వివరాలను బట్టి మతిస్థిమితం సరిగా లేకుండా ముందురోజు గ్రామంలో తిరుగుతుండగా కొంతమంది గమనించినట్లు తెలిపారని కావున అట్టి వ్యక్తి గురించి ఏవైనా అనవాళ్లు తెలిసినట్లయితే హసన్ పోలీస్ స్టేషన్8712685051, ఎస్సై 8712685097, ఇన్స్పెక్టర్ 8712685124నెంబర్లకు హసన్ పర్తి పోలీసులు కోరారు.



## జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థిని

**జఫర్గడ్,జనవరి7(తెలంగాణ ముచ్చట్లు):** డిసెంబర్ నెల 30,31, మరియు జనవరి 1వ తేదీల్లో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం పల్లవి మోడల్ స్కూల్ లో జరిగిన 44వ రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలలో స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థిని డి.రితిక (ఎంపీసీ సెకండ్ ఇయర్) అద్భుతమైన ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్రీకాంత్తెలియజేశారు. రితికను ప్రిన్సిపాల్ శ్రీకాంత్ శాలువాతో సత్కరించి అభినందించారు. రితిక ఈనెల 8వ తారీఖు నుండి 11వ తారీకు వరకు మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాలో జరగబోయే 44వ జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొనబోతుంది ,రితిక ఎంపిక పట్ల ప్రిన్సిపాల్ మరియు పిఈటిలు బి రాజు, ఏ శ్రీనాథ్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# దివ్యాంగులు విద్యలో ముందుకు సాగి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి,జనవరి7(తెలంగాణ ముచ్చట్లు):**





దివ్యాంగులను అన్ని విధాలుగా ఆదుకోవడానికి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తోందని, వారు చదువులో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాత మార్కెట్ యార్డు ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, గ్రిడ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో జిల్లాలోని 730 మంది దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేయడం అభినందనీయమని తెలిపారు.గత సంవత్సరం దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ భవన నిర్మాణానికి వెయ్యి గజాల స్థలం కేటాయించడం జరిగిందని, ఆ స్థలంలో భవన నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. దివ్యాంగులు ఎక్కడా తక్కువ కాదని, సమాజంలోని అన్ని రంగాల్లో సకలాంగులతో సమానంగా పోటీ పడుతూ తమ సత్తా చాటుతున్నారని కొనియాడారు.

రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంత ఆలస్యం జరిగినప్పటికీ, మేనిఫెస్టోలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లాలోని 728 మంది దివ్యాంగులకు 70.73 లక్షల రూపాయల విలువైన ఉపకరణాలు అందజేసినందుకు సంబంధిత యాజమాన్యాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ కార్పొరేషన్ల సామాజిక బాధ్యత నిధులు, అభివృద్ధి నిధులు వనపర్తి జిల్లాకు అధికంగా కేటాయించి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

అనంతరం దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేయగా, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 20 మందికి ఒక్కొక్కరికి ముప్పై వేల రూపాయల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలింకో డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజయ్ సింగ్, గ్రిడ్ కార్యనిర్వాహక సంచాలకులు ఎం.కె. రమేష్, మార్కెట్ యార్డు అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఆర్డీవో సుబ్రమణ్యం, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అఫ్జలుఫిన్, తహసిల్దార్ రమేష్ రెడ్డి, దివ్యాంగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మీసాల మోహన్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తిలో శ్రీనివాస థియేటర్‌ను ప్రారంభించిన జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,జనవరి7(తెలంగాణ ముచ్చట్లు):**



వనపర్తి పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీనివాస థియేటర్‌ను బుధవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఘనంగా ప్రారంభించారు. థియేటర్ యజమాని సుదర్శన్ ఆహ్వానమేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి థియేటర్‌ను ప్రేక్షకులకు అంకితం చేశారు.

ఈ సందర్భంగా జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ.. వనపర్తి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వినోద సదుపాయాలు అందుబాటులోకి రావడం ఆనందకరమని పేర్కొన్నారు. ఇలాంటి థియేటర్లు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

శ్రీనివాస థియేటర్‌ను అత్యాధునిక శబ్ద వ్యవస్థ, చిత్ర ప్రదర్శన సాంకేతికత, విశాలమైన సీటింగ్ ఏర్పాట్లతో సౌకర్యవంతంగా నిర్మించినట్లు యాజమాన్యం వెల్లడించింది. ప్రారంభోత్సవం అనంతరం తొలి సినిమా ప్రదర్శనకు ప్రేక్షకులు ఉత్సాహంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమాజాన్ని చైతన్యపరిచే, స్ఫూర్తిదాయకమైన చిత్రాలను ప్రదర్శించే దిశగా యాజమాన్యం కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్దన్, జిల్లా విద్యార్థి సంఘం అధ్యక్షుడు రోహిత్, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, గోపాల్‌పేట మండలం మాజీ జిల్లా పరిషత్ సభ్యుడు రాజేశ్వర్ రెడ్డి, వనపర్తి మండలం రైతు విభాగం అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, వనపర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రాగి అక్షయ్, గోపాల్‌పేట మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జిల్లెల ప్రవీణ్ రెడ్డి, వనపర్తి మండల విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, పెద్దమందడి మండల విద్యార్థి సంఘం నాయకులు వెంకటేష్ సాగర్‌తో పాటు సీనియర్ నాయకులు జానంపేట నాగరాజు, కోళ్ల వెంకటేష్, వాకిటి బాల్ రాజు, కృపాకర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బాలరాజు, ఎంట్ల రవి, వెంకటేష్, పాండు రావు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెరల సమస్యలపై జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారికి వినతి

**వనపర్తి,జనవరి7(తెలంగాణ ముచ్చట్లు):**



జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్ ఖాన్‌ను వనపర్తి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు దాసర్ల భూమయ్య మర్యాదపూర్వకంగా కలిసి వడ్డెర కులానికి సంబంధించిన సమస్యలను వివరించారు.

ఈ సందర్భంగా దాసర్ల భూమయ్య మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలోని వడ్డెరలు సంప్రదాయ కులవృత్తి అయిన రాయికోట్టే పనిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు.

కులవృత్తి చేసుకునేందుకు అత్యాధునిక యంత్రాలను పూర్తి సబ్సిడీపై అందజేయాలని, ఆ యంత్రాల నిర్వహణకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే గుట్టలు, క్వారీలపై పూర్తి అధికారం వడ్డెర్లకే కల్పించాలని, ఇందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. వడ్డెర ఫెడరేషన్‌ను వడ్డెర కార్పొరేషన్‌గా మార్చి పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల జనవరి 11న వడ్డెర్ల ఐకాన్ శ్రీ వడ్డే ఓబన్న 219వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో అధికారికంగా నిర్వహిస్తున్న సందర్భంగా, జిల్లా కేంద్రంలో కూడా అధికారికంగా ఘనంగా నిర్వహించాలని కోరుతూ వినతి పత్రాన్ని అధికారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓర్సు వెంకటయ్య, జిల్లా కోశాధికారి ముద్దల ఈశ్వర్, జిల్లా నాయకులు స్వామి రాంచందర్, కొమిరే ఆంజనేయులు, పసుపుల కృష్ణయ్య, రాంబాబు, దాసర్ల బీచుపల్లి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు చట్టబద్ధమైన “బీసీ సబ్ ప్లాన్” అమలు చేయాలి

- తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్
- కాప్రా తాసిల్దార్‌కు వినతి పత్రం

**కాప్రా, జనవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):**



ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే వెనుకబడిన తరగతుల (బీసీ) సమగ్ర అభివృద్ధి కోసం చట్టబద్ధమైన “బీసీ సబ్ ప్లాన్”ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యూత్ ప్రెసిడెంట్ సింగం అరుణ్ పటేల్ కాప్రా తాసిల్దార్ బైరెడ్డి రాజేష్‌కు బుధ వారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు, చట్టపరమైన రక్షణ అత్యంత అవసరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి ఇప్పటి వరకు బీసీల కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పూర్తిస్థాయి లో ఖర్చు చేయకుండా మిగులు చూపడం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని విమర్శించారు.కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ బీసీలకు ప్రతి బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 50 శాతం పైగా నిధులు కేటాయించాలన్నారు. అలాగే బీసీల కోసం కేటాయించిన నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు “బీసీ సబ్ ప్లాన్”కు చట్టబద్ధత కల్పించాలని కోరారు. విద్యా రంగంలో ప్రతి మండలంలో బహుజన గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలని, విదేశీ విద్యానిధి పథకాన్ని మరింత సరళతరం చేయాలని సూచించారు.నిరుద్యోగ బీసీ యువతకు, సంప్రదాయ కుల వృత్తులపై ఆధారపడిన వారికి ఎలాంటి షరతులు లేకుండా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల గణనలో బీసీలకు సంబంధించిన నివేదికను తక్షణమే బహిర్గతం చేయాలని కోరారు.కేవలం నినాదాలతో కాకుండా, నిధులతో కూడిన చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ ద్వారానే బీసీలకు నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా మండల టి ఆర్ పి నాయకులు అనూప్ కుమార్, శ్రీనాథ్ పటేల్, దేవేందర్, ఉమేష్, వంశీ, కిరణ్ పాల్గొనారు.

గురువారం-08- జనవరి 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కీసరగుట్ట దేవస్థానం నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

- ముఖ్య అతిథులుగా ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్

**కీసర, జనవరి 07 (తెలంగాణ ముచ్చట్లు)**




మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్-మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ ఆలయానికి చేరుకుని శ్రీ రామలింగేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం నూతన చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన తటాకం వెంకటేష్‌కు, అలాగే నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కూడా ముఖ్య అతిథిగా పాల్గొని, దేవస్థానం అభివృద్ధి దిశగా పాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 2026 సంవత్సరానికి సంబంధించిన నూతన క్యాలెండర్‌ను ఎంపీ ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. కీసరగుట్టను మరింత ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు గంగారంలో విద్యుత్ వినియోగదారుల సదస్సు

- గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ఏ.డి.ఈ ప్రసాద్ బాబు

**సత్తుపల్లి, జనవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**



గంగారం గ్రామంలో నేడు (గురువారం) విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏ.డి.ఈ ప్రసాద్ బాబు మీడియా కు తెలిపారు. గంగారం గ్రామంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సీజీఆర్ఎఫ్-1 చైర్‌పర్సన్ వేణుగోపాల చారి ఆదేశాల మేరకు విద్యుత్ వినియోగదారుల కోర్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు వినియోగదారుల ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు.

ఈ సదస్సులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, వోల్టేజ్ హెచ్చు-తగ్గుదల, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ అభివృద్ధి, లోపాలున్న మీటర్ల మార్పు, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసుల పేరు మార్పు, అధిక బిల్లుల సమస్యలు, కేటగిరీ మార్పు, సర్వీస్ రద్దు వంటి సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదులు అందించవచ్చని తెలిపారు. ఈ సదస్సు ద్వారా సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందని పేర్కొన్న ప్రసాద్ బాబు, టీజీఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**వివరాలకు**

చైర్‌పర్సన్ ఎన్.వి. వేణుగోపాల చారి - 8712481313,
మెంబర్ టెక్నికల్ కె. రమేష్ - 8712481314,
మెంబర్ ఫైనాన్స్ ఎన్. దేవేందర్ - 8712481316,
ఇండిపెండెంట్ మెంబర్ ఎం. రామారావు - 8712481485
నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

ప్రతి విద్యుత్ వినియోగదారుడు ఈ సదస్సులో పాల్గొని సమస్యలు పరిష్కరించుకొని లబ్ధి పొందాలని ఆయన కోరారు.

# మల్లాపూర్ డివిజన్ అభివృద్ధికి మరింత కృషి చేస్తా నెమలి అనిల్ కుమార్

**మల్లాపూర్, జనవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**



మల్లాపూర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.బుధవారం మల్లాపూర్ డివిజన్‌కు చెందిన పలు కాలనీల నుంచి వచ్చిన ప్రజలతో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెమలి అనిల్ కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యలు, రోడ్ల దుస్థితి, డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, వీధి దీపాల కొరత, పారిశుధ్య సమస్యలు, చెత్త సక్రమంగా తొలగించకపోవడం వంటి అనేక సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న నెమలి అనిల్ కుమార్, వాటిని ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, సంబంధిత శాఖల అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, "మల్లాపూర్ డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది. ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తాం. ప్రతి కాలనీ అభివృద్ధి చెందేలా నిరంతరం కృషి చేస్తాం" అని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ఈ సమయంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక కార్యకర్తలు, వివిధ కాలనీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వినిపించారు.

# ఐడిబిఐ బ్యాంకు సహకారంతో తాటికాయల ప్రైమరీ పాఠశాలలో వాటర్ ప్యూరిఫైయర్ ప్రారంభం

- రాంపూర్ ఐడిబిఐ బ్యాంకు సామాజిక సహకారం

**ధర్మసాగర్,జనవరి07(తెలంగాణ ముచ్చట్లు):**





ధర్మసాగర్ మండలం, తాటికాయల గ్రామంలోని ప్రైమరీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో ఐడిబిఐ బ్యాంకు రాంపూర్ శాఖ ఆధ్వర్యంలో 60వేలు విలువగల వాటర్ ప్యూరిఫైయర్‌ను అందజేసి, ఘనంగా ప్రారంభించారు. పాఠశాలలో స్వచ్ఛమైన తాగునీటి సమస్య ఉందని గమనించిన ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయురాలు హేమలత ఈ విషయాన్ని బ్యాంకు ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ప్రయత్నాలకు స్పందించిన బ్యాంకు యాజమాన్యం పాఠశాలకు ఈ వాటర్ ప్యూరిఫైయర్‌ను అందించడం విశేషంగా నిలిచింది.

ప్రారంభ వేడుకలో రాంపూర్ ఐడిబిఐ బ్యాంకు మేనేజర్ రత్నాకర్, కాశిబుగ్గ శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, మహేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటానికి శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యం చాలా ముఖ్యమని వారు తెలిపారు. నీటి మూలంగా వచ్చే వ్యాధులు తగ్గి, విద్యార్థులు చదువుపై మరింత దృష్టి పెట్టగలుగుతారని వివరించారు. గ్రామ సర్పంచ్ ననుబాల సోమక్క చంద్రమొగిలి, ఉపసర్పంచ్ పెసరు శివ, మాజీ సర్పంచ్ రమేష్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి బ్యాంకు అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. విద్యా, ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి గ్రామ పంచాయతీ నిరంతరం కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు.

హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమా మేరీ, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, వాటర్ ప్యూరిఫైయర్ ఏర్పాటు వల్ల విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందుతుందని, ఇది పాఠశాల స్థాయిలో అత్యంత అవసరమైన సదుపాయమని అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఐడిబిఐ బ్యాంకు ప్రతినిధులకు శాలువాలతో సత్కారం చేసి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

వాటర్ ప్యూరిఫైయర్ ప్రారంభంతో పాఠశాలలో నిత్యం స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడంతో ఆరోగ్యవంతమైన విద్యా వాతావరణం ఏర్పడిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు నవీన్, రాజు, కళ్యాణి, ఉషారాణి, వసుంధర, ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు రాజు, హేమలత, సీఆర్పీ రనుప తదితరులు పాల్గొన్నారు.





# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 200 మందికి అన్నదానం.!

- సత్తుపల్లిలో 11 రోజులపాటు అంగర్ సర్వీస్

**సత్తుపల్లి, జనవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**

లయన్స్ క్లబ్ సత్తుపల్లి ఆధ్వర్యంలో అంగర్ సర్వీస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సత్తుపల్లిలో 200 మంది నిరుపేదలకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. పేదల ఆకలి తీర్చే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమం 11 రోజులపాటు కొనసాగుతుందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోగడ రమేష్ తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని తపాలా శాఖ ఏరియా మేనేజర్ రాజేష్, విశ్వశాంతి విద్యాలయం కరస్పాండెంట్ పసుపులేటి నాగేశ్వరరావు ప్రారంభించారు. సమాజ సేవే లక్ష్యంగా లయన్స్ క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు మందపాటి ప్రభాకర్ రెడ్డి, కొత్తూరు ప్రభాకర్ రావు, చల్లగుండ్ల అప్పారావు, తోట రమేష్, పెనుగొండ రమేష్, మందపాటి చెన్నారెడ్డి, ఎస్కే వలి, మిద్దె శ్రీను, గార్లపాటి సత్యనారాయణ, వహీద్, హైమద్, చావా మనోజ్, రహమద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల భద్రతే లక్ష్యం.. బడి బస్సుల తనిఖీలు

- సత్తుపల్లిలో 32 బస్సుల తనిఖీ.
- ప్రమాదాలకు అడ్డుకట్టే లక్ష్యంగా అధికారులు చర్యలు.
- మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జె.ఎన్. శ్రీనివాసరావు.

**సత్తుపల్లి, జనవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**







పిల్లల ప్రాణ భద్రతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బడి బస్సులపై విస్తృత తనిఖీలు చేపట్టారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం (జనవరి 1 నుంచి 31 వరకు) తో పాటు ఇటీవల చోటు చేసుకున్న పాఠశాల బస్సుల ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా రవాణా అధికారి జగదీష్ ఆదేశాల మేరకు బుధవారం నుంచి ఈ తనిఖీలు ప్రారంభమయ్యాయి.

ఖమ్మం జిల్లాలో మొత్తం 764 వరకు ప్రైవేట్ విద్యాసంస్థల బడి బస్సులు ఉండగా, ఈనెల 18వ తేదీ వరకు విస్తృత స్థాయిలో తనిఖీలు కొనసాగనున్నాయి. భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని అధికారులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఈ తనిఖీలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతాయని తెలిపారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జె.ఎన్. శ్రీనివాసరావు, సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డితో కలిసి స్థానిక ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 32 బడి బస్సులను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా బస్సుల స్థితిగతులు, డ్రైవర్ల లైసెన్సులు, హ్యాండ్ బ్రేక్, టైర్ల కండిషన్, అత్యవసర ద్వారాలు, ఫిట్నెస్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు తదితర 24 అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి బడి బస్సుకు ప్రత్యేకంగా నివేదిక రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సత్తుపల్లి ఎంవీఐ పరిధిలో మొత్తం 147 బడి బస్సులు ఉండగా, ఈ తనిఖీ కార్యక్రమం ఈనెల 18వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. తనిఖీల అనంతరం లోపాలు గుర్తించిన బస్సులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, సమగ్ర నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఈ చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు.





# అంగన్వాడి కేంద్రం సందర్శించిన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్


**పెద్దమందడి,జనవరి7(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలోని రెండో అంగన్వాడి కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో విద్యార్థుల సంఖ్య, ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల వయసు గల చిన్నారులకు అందిస్తున్న తోడ్పాటు పోషకాహార పంపిణీ విధానాన్ని ఆయన పరిశీలించారు. పోషకాహారం సరఫరా ఎలా జరుగుతోందనే అంశంపై సర్పంచ్ వివరాలు తెలుసుకొని, నిర్వహణపై తల్లిదండ్రులను అడిగి వారి అభిప్రాయాలను సేకరించారు. విద్యార్థులు మరియు గర్భిణీ స్త్రీలకు బాలామృతం, గుడ్లు పంపిణీ చేయడం జరిగినది. అలాగే తల్లిదండ్రులు ప్రతి నెల అందించే పాలు, గుడ్లు, బాలామృతాన్ని సకాలంలో తీసుకొని పిల్లలను ఆరోగ్యంగా ఉంచే విధంగా ప్రతిరోజూ అంగన్వాడి కేంద్రానికి పంపించాలని సూచించారు. అంగన్వాడి ఉపాధ్యాయులు విధిగా విద్యార్థులు మరియు గర్భిణీ స్త్రీల ఇళ్లకు వెళ్లి పోషకాహార పంపిణీ చేయాలని సర్పంచ్ సూచించారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ మరియు వార్డు సభ్యుడు మద్దిరాల శ్రీకాంత్ రెడ్డిని అంగన్వాడి ఉపాధ్యాయురాలు ప్రేమిల, ఆశా కార్యకర్త బాలమ్మ మరియు విద్యార్థులు శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యుడు మద్దిరాల శ్రీకాంత్ రెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు నస్రీం బేగం, గ్రామ పెద్ద రాములు, యువకులు శరత్ రెడ్డి, మల్లికార్జున్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఓటర్ జాబితాపై అభ్యంతరాలను పరిష్కరించాలి

**రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని**

**ఖమ్మం బ్యూరో, జనవరి - 07 (తెలంగాణ ముచ్చట్లు)**





మున్సిపల్ ఓటర్ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని అన్నారు.

మున్సిపల్ ఓటర్ జాబితా తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లు, అధికారులతో రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్, హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్షించగా, ఇట్టి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ జిల్లాల వారీగా ఓటరు జాబితాలపై వచ్చిన అభ్యంతరాల వివరాలను సమీక్షించి మాట్లాడుతూ, ఈ నెల 12 వ తేదీ నాడు వార్డుల వారిగా ఫోటో ఎలక్టరోల్స్ జాబితా ప్రచురించడంతో పాటు, 13వ తేదీన డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాలను ప్రచురిస్తామని తెలిపారు. 16వ తేదీన తుది పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రచురించి, పోలింగ్ కేంద్రాల వారీగా ఫోటో ఎలక్టరోల్స్ ప్రచురిస్తామని వెల్లడించారు. అభ్యంతరాలు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. 2025 సంవత్సరం సంబంధించి 3వ సప్లిమెంటరీ ఓటరు జాబితా నవంబర్ 15వ తేదీన విడుదలైందని, దాని ప్రకారం పట్టణాలలో వార్డుల వారీగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా జనవరి 1వ తేదీన విడుదల చేశామని తెలిపారు. అవసరమున్న అన్నిచోట్లా వెబ్ కాస్టింగ్ కు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ జాబితాలపై 192 అభ్యంతరాలు రాగా, ఇప్పటికి 129 అభ్యంతరాలను పరిష్కరించినట్లు, మిగులు ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించ నున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఉన్న సిబ్బంది డాటాను మునిసిపల్ ఎన్నికల లోను తీసుకోనున్నట్లు అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, మున్సిపల్ కమీషనర్లు శ్రీనివాస రెడ్డి, సంపత్, నర్సింహ, రామచందర్ రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన మద్దిగట్ల సర్పంచ్ మేకల రాములు

**పెద్దమందడి,జనవరి7(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలానికి నూతనంగా నియమితులైన ఎస్సై జలంధర్ రెడ్డిని మద్దిగట్ల గ్రామ సర్పంచ్ మేకల రాములు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ సహకారం ఎంతో అవసరమని సర్పంచ్ రాములు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలయ్యేందుకు పోలీస్-గ్రామ పాలన మధ్య సమన్వయం ఉండాలని కోరారు.దీనికి స్పందించిన ఎస్సై జలంధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల భద్రతే తమ ప్రథమ కర్తవ్యమని, గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు గ్రామ ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ మేకల రాములు, ఉప సర్పంచ్ రవి సాగర్, వార్డు సభ్యులు పాలెం రవి, మీసాల బాలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ఓల్డ్ భరత్ నగర్‌కు రూ.13.25 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు

**సీఎం రేవంత్ రెడ్డి చొరవతో భారీ నిధుల**

**ఉప్పల్, జనవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):**



కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఓల్డ్ విలేజ్‌లు, మురికివాడలకు సువర్ణావకాశాలు లభిస్తున్నాయని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.మురికివాడలు, ఓల్డ్ కాలనీల అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అవసరమైన నిధులను రాబట్టి అభివృద్ధి పనులు చేపడుతున్నామని వారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఉప్పల్ నియోజకవర్గానికి భారీగా నిధులు మంజూరు అవుతున్నాయని చెప్పారు.నియోజకవర్గంలోని ఓల్డ్ విలేజ్‌లు, మురికివాడల అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా చేపడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.ఓల్డ్ భరత్ నగర్‌లో రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులు ఉప్పల్ ఓల్డ్ విలేజ్ భరత్ నగర్‌లో రూ.1.25 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం మందుముల పరమేశ్వర్ రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, ఏఈ రాజ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఓల్డ్ భరత్ నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.12 కోట్లతో పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టామని తెలిపారు. మొత్తంగా రూ.13.25 కోట్లతో భరత్ నగర్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు.ఇదే తరహాలో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో ఉన్న ఓల్డ్ కాలనీలు, మురికివాడలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో భూసం రఘునాథ్ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, గౌరిగే చిరంజీవి, సల్ల రాజేందర్ రెడ్డి, బింగి రమేష్, పప్పుది రాకేష్ రెడ్డి, నరసింహ గౌడ్, బాలరాజు గౌడ్, అన్నపురెడ్డి వెంకటరెడ్డి, దొడ్ల రాజు, తెలకల రామ్ రెడ్డి, తెలకల వెంకట్ రెడ్డి, నరసింహా రెడ్డి, దాసరి కనకయ్య, తెలకల సుధాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, కిషోర్, ఓంకార్, బింగి రమేశ్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, నవీన్ రామ్, లక్ష్మణ్, కిరణ్, విజయ్, కర్నాకర్, హరిష్, బర్ల పరమేష్‌తో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కృష్ణారెడ్డి నగర్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటన

- స్థానిక సమస్యలపై అధికారులకు తక్షణ ఆదేశాలు

**చర్లపల్లి, జనవరి (తెలంగాణ ముచ్చట్లు):**

2ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కృష్ణారెడ్డి నగర్ ప్రాంతంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో ముఖాముఖి సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రాంతంలో నెలకొన్న రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, తాగునీటి సరఫరా లోపాలు, వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక వసతులపై అధికారులను ప్రశ్నించారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజల అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కారాలు అందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక కాలనీ వాసులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు ప్రాజెక్టుపై బీఆర్ఎస్ యాత్ర సిగ్గుచేటు

- కాళేశ్వరానికి ఇచ్చిన ప్రాధాన్యత పాలమూరుకు ఎందుకు ఇవ్వలేదు ?
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**వనపర్తి,జనవరి7(తెలంగాణ ముచ్చట్లు):**



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంపై అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ఒక్కరోజు కూడా ప్రశ్నించని బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు యాత్రలు చేపట్టడం సిగ్గుచేటని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు.

బుధవారం జిల్లా కేంద్రంలోని నందిని సులో గల ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇచ్చిన ప్రాధాన్యత పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రాజెక్టు దగ్గర కుర్చీ వేసుకుని పూర్తి చేస్తా అని అప్పటి సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు మాటలకే పరిమితమయ్యాయని అన్నారు. రూ.27 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును అస్తవ్యస్తంగా చేపట్టారని, ఒక ప్రాజెక్టు పూర్తికాక ముందే మరో ప్రాజెక్టుకు టెండర్లు పిలిచి కమిషన్లు దండుకున్నారని ఆరోపించారు. నార్లపూర్‌లో మోటార్ ఆన్ చేసి హెలికాప్టర్‌లో హైదరాబాద్ చేరేలోగానే బంద్ కావడం బీఆర్ఎస్ పాలన వైఫల్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.

పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేసింది కాంగ్రెస్ పార్టీనేనని, గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో, కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తోందో బహిరంగ చర్చకు సిద్ధమని ఎమ్మెల్యేలు సవాల్ విసిరారు. ఉమ్మడి జిల్లాకు చెందిన సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి గ్రామం, ప్రతి నియోజకవర్గం అభివృద్ధి దిశగా ముందుకెళ్తోందని తెలిపారు.ఈ సమావేశంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఖమ్మం నగరంలో మాజీ ఎంపీ నామ పర్యటన

- కూరాకుల , దిరిశాల, గొల్లపూడి కుటుంబాలకు మాజీ ఎంపీ నామ పరామర్శ


**ఖమ్మం బ్యూరో, జనవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ మాజీ లోక్ సభాపక్ష నేత, ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు బుధవారం నాడు ఖమ్మం నగరం లో పర్యటించారు. అందులో భాగంగా పలువురి ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. ముందుగా నగరంలోని శ్రీనగర్ కాలనీ నందు దిరిశాల వెంకటేశ్వరరావు (డివి) గారి మాతృమూర్తి మంగమ్మ ఇటీవల మరణించగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు అనంతరం మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం సోదరుడు కురాకుల పుల్లయ్య ఇటీవల మరణించగా వి వెంకటాయపాలెం లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు దానయ్య, ఆత్మ డైరెక్టర్ బానోత్ కీమా, మాజీ ఉప సర్పంచ్ లు లాల్ సింగ్, శంకర్, నాయకులు కోటేశ్వరరావు, ఆనంద్ రావు, సత్యం, బాబు, కిరణ్, రమేష్, శంకర్, శ్రీకాంత్, శివ, సూరి పాల్గొన్నారు. అక్కడ నుండి గోపాలపురం చేరుకొని ఇటీవల మరణించిన గొల్లపూడి నరసింహారావు నివాసానికి వెళ్లి వారి కుమారుడు రాంప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ కార్యక్రమాల్లో వైరా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర్లు, మధిర మండల పార్టీ అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, మధిర మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు, నాయకులు మోరంపూడి ప్రసాద్ రావు, సర్పంచ్ వాసిరెడ్డి నాగేశ్వరరావు, గొడ్డేటి మాధవరావు, పారా నాగేశ్వరరావు, తన్నీరు రవి, వాకదాని కోటేశ్వరరావు, బంధం నాగేశ్వరరావు, కోలేటి నవీన్, తోడేటి లింగయ్య, కొటారి రాఘవరావు, మహిళా నాయకులు చింతలచెర్వు లక్ష్మీ, చిత్తూరు ఇందుమతి, గొల్లపూడి సతీష్,వేగినాటి ప్రసాద్, భూక్యా అశోక్, మోహన్, నరసింహ, ఉపేందర్, వెంకట్, యువజన నాయకులు రేగళ్ళ కృష్ణప్రసాద్, చీకటి రాంబాబు, అబ్బూరి రామన్, కంచర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలి

- టీఆర్‌పి పార్టీ డిమాండ్‌తో తహసీల్దార్లకు వినతిపత్రం
- వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షులు రవికుమార్

**వనపర్తి,జనవరి7(తెలంగాణ ముచ్చట్లు):**



ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే వెనుకబడిన తరగతుల (బీసీ) సమగ్ర అభివృద్ధి కోసం చట్టబద్ధమైన "బీసీ సబ్ ప్లాన్"ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షులు జి. రవి కుమార్ డిమాండ్ చేశారు.

ఈ మేరకు టీఆర్‌పి పార్టీ వ్యవస్థాపకులు, అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు, రాష్ట్ర యూత్ అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్ సూచనలతో వనపర్తి జిల్లా మదనాపురం, ఆత్మకూర్, అమరచింత మండల కేంద్రాల్లో బుధవారం ఆయా మండల తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా జి. రవికుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు, చట్టపరమైన రక్షణ అత్యంత అవసరమని అన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు బీసీల కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయకుండా మిగులు చూపడం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ బీసీలకు ప్రతి బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 50 శాతం పైగా నిధులు కేటాయించాలన్నారు.అలాగే బీసీల కోసం కేటాయించిన నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలని కోరారు. విద్యారంగంలో ప్రతి మండలంలో బహుజన గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలని, విదేశీ విద్యానిధి పథకాన్ని మరింత సరళతరం చేయాలని సూచించారు.

నిరుద్యోగ బీసీ యువతకు, సంప్రదాయ కులవృత్తులపై ఆధారపడిన వారికి ఎలాంటి షరతులు లేకుండా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల గణనలో బీసీలకు సంబంధించిన నివేదికను తక్షణమే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కేవలం నినాదాలతో కాకుండా, నిధులతో కూడిన చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ ద్వారానే బీసీలకు నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీఆర్‌పి పార్టీ వనపర్తి జిల్లా జనరల్ సెక్రటరీ యూ. కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# ఘనంగా కలెక్టర్ సంతోష్ కుమార్ జన్మదిన వేడుకలు



**జోగులాంబ గద్వాల్,జనవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):**

రాజోలి మండల కేంద్రంలో జోగులాంబ గద్వాల్ జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని మహమ్మద్ భాష ఆధ్వర్యంలో శుభాకాంక్షల కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహమ్మద్ భాషతో పాటు కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు అభిమానంతో కలిసి జిల్లా కలెక్టర్‌కు పూల బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సాదాసీదాగా జన్మదిన వేడుకను నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది అంతా కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని ఆత్మీయ వాతావరణాన్ని నెలకొల్పారు. జన్మదిన వేడుకలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేస్తూ, సిబ్బంది అందరి అభిమానం తనకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తోందని తెలిపారు. కార్యక్రమం సానుకూల వాతావరణంలో విజయవంతంగా ముగిసింది




# ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సందర్శించిన రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, జనవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ డివిజన్ పరిధిలోని వి.టి.రోడ్, స్వరూప్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి సందర్శించారు.బుధవారం యశోద హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎం.ఎం ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే పరమావధిగా, సమాజ హితాన్ని దృష్టిలో ఉంచుకొని ఇలాంటి ఉచిత మెగా వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ శిబిరం నిర్వహించిన తేజస్విని పోలీ క్లినిక్ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు.ఈ వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులచే సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్త పరీక్షలు, రక్తపోటు (బీపీ), కీళ్ల నొప్పులు, థైరాయిడ్, షుగర్ పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచిత వైద్య సలహాలు మరియు మందులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో వైద్య శిబిరం నిర్వాహకులు జపాల శ్రీనివాస్ (మేనేజింగ్ డైరెక్టర్), డాక్టర్ తేజస్విని, డాక్టర్ వినీత్, డాక్టర్ రవితేజ, డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, సల్ల ప్రభాకర్ రెడ్డి, రంగుల శేఖర్, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె.!

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మా విష్ణువర్ధన్.
- పల్లెల్లో విస్తృత ప్రచారం చేయాలి.
- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కళ్యాణం వెంకటేశ్వరరావు.

**సత్తుపల్లి, జనవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**

మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న దేశ వ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మా విష్ణువర్ధన్ వెల్లడించారు. బుధవారం ఖమ్మం నగరంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

కార్మికులు దీర్ఘకాల పోరాటాలతో సాధించుకున్న హక్కులు, చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా లేబర్ కోడ్లు అమలు చేస్తున్నారని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా రోజుకు 8 గంటల పని విధానం అమలులో ఉండగా, దానిని తొలగించి పని గంటలను 11కు పెంచడం కార్మికులపై మోదీ ప్రభుత్వం చేసిన ద్రోహమని పేర్కొన్నారు. సంఘం ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛను కూడా హరించారని, కనీస వేతనాలపై స్పష్టత లేకుండా కార్మికులను కట్టు బానిసలుగా మార్చే కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కళ్యాణం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ల వల్ల కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని పల్లె పల్లెలో ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 11, 12 తేదీల్లో లేబర్ కోడ్ల రద్దు, ఉపాధి హామీ చట్టం పేరును మార్చడం ద్వారా జాతిపిత మహాత్మా గాంధీని అవమానించడం సరికాదని నిరసనగా, అలాగే నల్ల రైతు చట్టాల రద్దు కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ ఐక్య కార్యాచరణతో జిల్లాలో నిర్వహించనున్న జీపు జాతా సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి చలమాల విఠల్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు పెరుమాళ్ల మోహన్ రావు, శీలం నరసింహారావు, సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్, పిన్నింటి రమ్య, ముదాం శ్రీనివాసరావు, జిల్లా ఉపేందర్, ముత్తమాల ప్రసాద్, దొంగల తిరుపతిరావు, బండారు యాకయ్య, నవీన్ రెడ్డి, భూక్యా శ్రీను, కోటేశ్వరి, జెల్లరపు మంగ, కొలికపోగు సర్వేశ్వరరావు, జిక్కుల కృష్ణ, రామదాసు, బషీర్, కళ్యాణ్, రాములు, సత్తెనపల్లి నరేష్, వసపొంగు వీరన్న, మల్లికార్జునరెడ్డి, పాపారాణి, బాధావత్ శ్రీను, గాలి వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనలోనే గ్రామాలు, పట్టణాల అభివృద్ధి జరిగింది

- స్థానిక ఎన్నికల్లో పోరాడి పార్టీ జెండా నిలబెట్టిన సర్పంచ్ లకు అభినందనలు
- బీఆర్ఎస్ పార్టీ పట్ల రోజు రోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుంది
- ఇబ్బందులు పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు - మాజీ ఎంపీ నామ

**ఖమ్మం బ్యూరో, జనవరి 7(తెలంగాణ ముచ్చట్లు)**






ఖమ్మం జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రివర్యులు కేటీఆర్ ఆత్మీయ సమావేశం ఖమ్మం పట్టణ అధ్యక్షులు పగడాల నాగరాజు అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందన్నారు. భారత దేశానికి స్వతంత్రం వచ్చిన తరువాత మహాత్మా గాంధీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం సాకారం చేసే విధంగా పాలన చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. కేసీఆర్ పాలనలో పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందాయి అని ఈ సందర్భంగా గుర్తు చేసారు. ఖమ్మంలో కేటీఆర్ బైక్ ర్యాలీకి అపూర్వ స్పందన వచ్చిందన్నారు. ఖమ్మం జిల్లాలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ముగ్గురు మంత్రులు ఎన్ని ఇబ్బందులు పెట్టిన మన నాయకులు, కార్యకర్తలు వీరుల్లా పోరాడి మన సర్పంచ్ అభ్యర్థులు ను గెలిపించారన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కొన్ని చోట్ల బీఆర్ఎస్ మద్దతు దారులు గెలిస్తే మరల రీకౌంటింగ్ లు పెట్టి అధికార పార్టీ ఇబ్బందులుకు గురి చేసారని నామ అన్నారు. మంత్రి పదువులు శాశ్వతం కాదని, పుట్టిన నాటి నుండి మంత్రులుగా లేరు అలా అని చచ్చే వరకు ఎవరు మంత్రులు కూడా ఉండరన్నారు. జిల్లా లో ఉన్న మంత్రులు ఎన్ని రాజకీయాలు చేసి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఇబ్బందులకు గురి చేసిన వారిపై పోరాడి పార్టీ జెండాను గులాబీ శ్రేణులు నిలబెట్టారని తెలిపారు. అధికార అండతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. గత పదిహేడవ లోకసభలో తాను ఎంపీగా, లోక్ సభ ఫ్లోర్ లీడర్‌గా ఉన్నప్పుడు కేసీఆర్ ఆదేశాల మేరకు పార్లమెంట్ సమావేశాలను స్థంబింపజేసి రాష్ట్రానికి సరిపడా యూరియా ను తీసుకువచ్చామని కేసీఆర్ పాలనలో ఏనాడు రైతన్నలు యూరియా కోసం ఇబ్బంది పడలేదన్నారు. కేసీఆర్ ముందు చూపుతో రైతులు ఎరువులు విషయం లో కానీ విద్యుత్ విషయం లో కానీ ధాన్యం కొనుగోలు విషయం లో కానీ ఎక్కడ ఇబ్బందులు పడలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టాలంటే కేసీఆర్ పాలన రావాలని ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో రాజ్య సభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్, వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డ, రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వరరావు,హరిప్రియ, చంద్రావతి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు, మాజీ మార్కెట్ చైర్మన్ గుండాల కృష్ణ, మాజీ గ్రంధాలయ చైర్మన్ లు ఖమర్, ఉమా మహేశ్వరరావు, దిండిగల రాజేందర్, నాయకులు బొమ్మెర రామ్మూర్తి, ఉప్పల వెంకటరమణ, బిచ్చాల తిరుమలరావు, ఉద్యమకారులు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







# కదం తొక్కుతూ కదలి రండి

- ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఐ లక్ష్యం
- ఖమ్మం నగరంలో జీపుజాతా

**ఖమ్మం బ్యూరో, జనవరి7(తెలంగాణ ముచ్చట్లు)**

భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జనవరి 18న జరిగే బహిరంగ సభకు వేలాది మంది కదం తొక్కుతూ కదిలి రావాలని సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వందేళ్లుగా సిపిఐ పని చేస్తుందని అధికార యావ లేకుండా ప్రజల పక్షాన నిలిచిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనని ఆయన తెలిపారు. బుధవారం శతాబ్ది ఉత్సవ ముగింపు సభ ప్రచారంలో భాగంగా ఎన్టీఆర్ సర్కిల్, గ్రేయిన్ మార్కెట్, పాత బస్టాండ్ సెంటర్, ముస్తఫానగర్, రోటరీ నగర్, రామన్నపేట, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో జితేందర్రెడ్డి మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ నాటి స్వాతంత్ర్య పోరాటంలోనూ ఆ తర్వాత నిజాం వ్యతిరేక పోరాటంలోనూ కమ్యూనిస్టు పార్టీ విరోచిత పాత్ర నిర్వహించిందన్నారు. 1925లో ఈ దేశ సంపూర్ణ స్వాతంత్ర్యానికి తీర్మానం చేసింది తొలుత కమ్యూనిస్టు పార్టీయేనని కాంగ్రెస్ పార్టీ 1927లో సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిందని జితేందర్ రెడ్డి తెలిపారు. పేషావర్ మీరట్ సహా పలు కుట్ర కేసులను బ్రిటిష్ ప్రభుత్వం కమ్యూనిస్టులపై పెట్టి తీవ్ర నిర్బంధాలకు గురి చేసిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు భారతదేశపు నడిబొడ్డున నిజాం స్వతంత్ర రాజ్యాంగా ప్రకటించుకున్నప్పుడు భారతదేశంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. నాలుగున్నర వేల మంది అమరులయ్యారని తద్వారా నిజాం రాజ్యం భారతదేశంలో విలీనమైందన్నారు. భూమి కోసం భుక్తి కోసం జరిగిన ఆ మహోద్యమం తెలంగాణ ప్రజల్లో చైతన్యానికి కారణమైందని జన జీవితంలో మార్పు తెచ్చిందన్నారు. భూ సంస్కరణల చట్టం, దున్నేవాడికే భూమి దక్కాలని, బ్యాంకుల జాతీయకరణ, ఇటీవల జాతీయ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం సహా అనేక పోరాట విజయాలను కమ్యూనిస్టు పార్టీ సాధించిందన్నారు. 2024 డిసెంబర్ 26 నుంచి దేశ వ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయని ముగింపు ఉత్సవం జనవరి 18న ఖమ్మంలో జరుగుతుందని ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని జితేందర్రెడ్డి పిలుపునిచ్చారు. ఖమ్మం నగరం ఉద్యమాల గుమ్మంగా నిలిచిందని ఖమ్మం నగర ప్రజలు అనేక దశాబ్దాలుగా వామపక్ష పార్టీలను ఆదరిస్తున్నారని ఆ క్రమంలోనే జనవరి 18 సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ కె జానిమియా, మహ్మద్ సలాం, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, సిహెచ్ సీతామహలక్ష్మి, పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు గాదె లక్ష్మి నారాయణ, తాటి నిర్మల, నూనె శశిధర్, వరదా నర్సింహారావు, బోడా వీరన్న, మందా వెంకటేశ్వర్లు, సిద్ధి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న కళారూపాలు :**

ప్రచార జాతాల సందర్భంగా ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేకించి సమకాలిన పరిస్థితులను వివరిస్తూ పాడిన పాటలు పలువురిని ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో ఆరెంపుల సతీష్, పల్లెసుద్దుల శ్రీను, మనోజ్, చందర్రావు, శ్రీకాంత్, శాంతి, మృతేష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన డిడియన్ అర్చక చైతన్య సధస్సు

**ఖమ్మం బ్యూరో, జనవరి 7 (తెలంగాణ ముచ్చట్లు)**





బుధవారం ఖమ్మం శ్రీ శ్రీ సర్కిల్ పి ఎస్ ర్ కాన్వెన్షన్ హాల్ నందు ఖమ్మం భద్రాద్రి జిల్లాల దూప దీప నైవేద్య అర్చక చెతన్య సదస్సు విజయవంతం మైనదని ఖమ్మం జిల్లా అధ్యక్షులు మునగలేటి రమేష్ శర్మ ప్రధాన కార్యదర్శి మరింగంటి భార్గవాచార్యులు కోశాధికారి అన్నావజ్జల ప్రసాద్ శర్మ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు పురాణం కిరణ్ కుమార్ శర్మ కార్యదర్శి సంతోష్ చారి కోశాధికారి కౌతా ప్రసాద్ శర్మ సంయుక్తగా ప్రకటన విడుదల చేసినారు. ఉమ్మడి జిల్లాలోని మారుమూల గ్రామిణ ప్రాంతాలలో డి డి యన్ పథకం ద్వారా అర్చకత్వం నిర్వహిస్తున్న నాలుగు వందలకు పైగా అర్చకులు హాజరైనారు ఈ సదస్సుకు సభాధ్యక్షులు గా అన్నవజ్జల ప్రసాద్ శర్మ అధ్యక్షత వహిస్తూ అర్చకులందరు సమైక్యంగా ఉంటేనే అర్చకుల సమస్యలు వేతన పెరుగుదల, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు లాంటి అర్చక ప్రయోజనాలు సాధించకలుగుతామని,తెలంగాణ ప్రభుత్వం ,తెలంగాణా రాష్ట్రం సుసంపన్నంగా, సుభిక్షంగా ఉంచేవిధంగా దేవాలయాలలో అర్చన చేయాలని అర్చకులకు సూచన చేశారు. సభకు విశిష్ఠ అతిధిగా డి డి యన్ రాష్ట్ర అధ్యక్షులు దౌలతాబాద్ వాసుదేవాశర్మ హాజరై అర్చకులను చెతన్య పరిచారు. నేటికాలంలో ప్రభుత్వం అందించే గౌరవ వేతనం మరియు పడితరం సరిపోవడం లేదఅని అర్చకులకు 25,000/రూ వేతనం 10,000/రూ పడితరం అందించాలి అని సదస్సు నుండి ప్రభుత్వన్ని విజ్ఞప్తి చేశారు . అర్చకులకు ప్రభుత్వ ఆరోగ్య పథకం వర్తింప చేయాలి అని, డి డి యన్ అర్చకులకు ఉద్యోగ భద్రత కలిపించాలి అని 12 డిమాండ్ల పై అర్చకలను చైతన్య పరిచి డిమాండ్ల పై ఆమోదం పొందినారు.

ఉమ్మడి జిల్లా సంఘాల ఆహ్వానాన్ని మన్నించి సభకు ముఖ్య అతిధులుగా తెలంగాణ గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ యరగట్ల హనుమంత రావు, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బైరి హరినాద్ బాబు,మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బండారు నరసింహారావు, పాలేరు నియోజక వర్గ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, టీఎన్జీఓ ఖమ్మం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు హాజరై అర్చకులను ఉద్దేశించి ప్రసంగించారు .అర్చకుల కోరికలు సామాన్య మైనవని మా వంతుగా జిల్లా మంత్రివర్యులకు డీడీఎన్ అర్చకుల సమస్యల వివరించి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని సభా ముఖంగా తెలియజేశారు .

అనంతరం జిల్లా సంఘం ముఖ్య అతిదులను శాలువాలతో సత్కరించి అశ్వి ర్వచనం చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర సంఘం కోశాధికారి నందనం హరికిషన్ శర్మ,రాష్ట్ర సంఘం మహిళా కన్వినర్ విశాలాక్షి, రాష్ట్రసంఘం కార్యవర్గ సభ్యులు పేమ్మరాజు అచ్యుతరామారావు , పరిపూర్ణ చారి, శ్రీధర్ శర్మ, సంగమేశ్వర ప్రసాద్,సురేష్ శర్మ, సుందర్ కుమార్ చార్యులు, ఉదయ్ శర్మ, రామకృష్ణ శాస్త్రీ, భార్గవాచార్యులు ప్రసాద్ శర్మ సుమన్ శర్మ సాదునాయక్, బిచ్చనాయక్, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులను మరియు సమావేశానికి సహకరించిన దాతలను శాలవా తో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేసినారు. అనంతరం ఖమ్మం జిల్లా అర్చక సంఘం క్యాలండర్ ఆవిష్కరించి 12డిమేండ్ల తో కూడిన వినతి పత్రాన్ని అర్చకులు ర్యాలీగా వెళ్లి ఖమ్మం జిల్లా కలెక్టర్ అనీదీప్ దూరిశెట్టి కి అందించారు.

హాజరైన అర్చకులకు సంఘం తరుపున అధ్యక్ష , కార్యదర్శులు ధన్యవాదములు తెలియచేసినారు

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## కరుణాపురం గ్రామ సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్‌కు కేటీఆర్ అభినందనలు

**ధర్మసాగర్,జనవరి07(తెలంగాణ ముచ్చట్లు):**

ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కరుణాపురం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన గుర్రపు రీనా ప్రవీణ్‌ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కే.టి. రామారావు అభినందించారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.గ్రామ అభివృద్ధిని కేంద్రంగా చేసుకుని పారదర్శక పాలన అందించాలని, ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల విస్తరణ పై ప్రత్యేక దృష్టి సారించాలని కేటీఆర్ పేర్కొన్నారు. స్థానిక స్వపరిపాలన సంస్థల బలోపేతమే సమగ్ర అభివృద్ధికి మార్గమని ఆయన వ్యాఖ్యానించారు.కేటీఆర్ నుంచి అభినందనలు అందుకోవడం ఆనందంగా ఉందని సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్ తెలిపారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తూ, గ్రామ సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఆమె స్పష్టం చేశారు.



## వున్నం అచ్చమ్మకు ఘన నివాళి

- మాజీ ఎంపీ నామ

**ఖమ్మం బ్యూరో, జనవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):** నేలకొండపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వున్నం బ్రహ్మయ్య మాతృమూర్తి అచ్చమ్మ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఇట్టి విషయం తెలిసిన బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం ఉదయం ముజ్జుగూడెం గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్లి అచ్చమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని నామ ప్రార్ధించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య కుటుంబ సభ్యులను నామ పరామర్శించి ఓదార్చినారు. ఈ కార్యక్రమంలో మరికంటి ధనలక్ష్మి, మోరంపూడి ప్రసాద్ రావు, నాగుబండి శ్రీనివాసరావు, కోటి సైదిరెడ్డి, మరికంటి రేణుబాబు, షేక్ హుస్సేన్, శీలం వెంకటలక్ష్మి,అనగాని నర్సింహారావు, వెన్నబోయిన శ్రీను, శీలం వెంకట నర్సయ్య, బొడ్డు వసంత, రాజేశ్వరాపురం సర్పంచ్ దండా రంగయ్య, జటంగి వెంకటేశ్వర్లు, భువనగిరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఫైనాన్స్ చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

**ఖమ్మం బ్యూరో, జనవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):** అధిక వడ్డీలతో అక్రమ ఫైనాన్స్ చేస్తున్న వ్యక్తులను అదుపులో తీసుకొని ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీసులు అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. చట్టవేరుద్దంగా అధిక వడ్డీతో గిరిగిరి ఫైనాన్స్ చేస్తున్నారని దానవాయిగూడెంకు చెందిన బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు సారధి నగర్ కు చెందిన శివ కుమార్, బానోత్ దీపా కుమారి అనే వ్యక్తులను అదుపులో తీసుకొని అక్రమ ఫైనాన్స్‌కు సంబంధించిన ప్రంసరీ నోట్లు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని, స్వాధీనం చేసుకున్న సొత్తుతో పాటు పరారీ వున్న వ్యక్తి పై అవసరమైన చర్యల కోసం ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ కు అప్పగించినట్లు తెలిపారు.



## 2లక్షల 33 వేల విలువ గల నిషేధిత సిగిరెట్లను పట్టివేత

**ఏసీపీ టాస్క్ ఫోర్స్**

**ఖమ్మం బ్యూరో, జనవరి 7 (తెలంగాణ ముచ్చట్లు)**

నగరంలోని శ్రీనివాస్ నగర్ ఎస్‌ఎస్వి టవర్స్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత సిగిరెట్లను విక్రయిస్తున్న శ్రీ రామ్ రమేష్ బాబు ను అదుపులోకి తీసుకోని ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో అప్పగించి నట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. అనుమతి లేని, నిషేధించిన సిగరెట్ల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారంతో స్థానిక పోలీసులతో కలసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేని నిషేధించబడిన, హానికరమైన నిషేధిత వివిధ బ్రాండ్ల సిగరెట్ల నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 2,33,000/ విలువ ఉంటుందని తెలిపారు.

**స్వాధీనం చేసుకున్న వివరాలు:**

1) పారిస్ సిగరెట్ పెట్టెలు (28) వ
2) గుడాన్ గరోమ్ సిగరెట్ పెట్టెలు (51)
3) ఎస్సే గోల్డ్ స్పెషల్ సిగరెట్ పెట్టెలు (11)
4) ఎస్సే లైట్ స్పెషల్ సిగరెట్ పెట్టెలు (49)
5) ఏఐఓ సిగరెట్ పెట్టెలు (176)

# కేటీఆర్‌కు ఖమ్మంలో గ్రాండ్ వెల్కమ్

- హామీల అమల్లో రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యం
- ప్రాజెక్టులు కట్టలేని దద్దమ్మ ప్రభుత్వం
- మాటలు తప్ప చేతలు లేని రేవంత్ రెడ్డి
- రాష్ట్ర నీటి వాటాపై చెపుదామంటే శాసనసభలో సమయం ఇవ్వలేదని ఆరోపణ

**ఖమ్మం బ్యూరో, జనవరి 7 (తెలంగాణ ముచ్చట్లు)**



మాజీ మంత్రి ,బీఆర్ యస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు బుధవారం ఖమ్మం వచ్చిన సందర్భంగా ఆ పార్టీ నాయకులూ ,కార్యకర్తలు గ్రాండ్ వెల్కమ్ పలికారు .హైద్రాబాద్ నుంచి ఖమ్మం రోడ్ మార్గంలో వచ్చిన కేటీఆర్ ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ,మాజీ పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు ఖమ్మం కూరగాయల మార్కెట్ సమీపంలోని ఆంజనేయస్వామి టెంపుల్ వద్ద స్వాగతం పలికారు ... అక్కడ నుంచి కేటీఆర్ ,అజయ్ , నామా ,ఇతర నాయకులూ ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తూ జిల్లా బీఆర్ యస్ కార్యాలయం వరకు వెళ్లారు ..ఈ సందర్భంగా బైపాస్ రోడ్ లో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగింది ..పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తూ వాహనాలను పంపించారు ...ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులను సన్మానించేందుకు ఆయన స్వయంగా ఖమ్మం రావడంతో అభిమానులు ,కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు ..టపాసులు పేలుస్తూ , బీఆర్ యస్ పాటలతో ర్యాలీ సాగింది ..కొందరు కార్యకర్తలు నృత్యం చేయగా, మరికొందరు నినాదాలు చేస్తూ ర్యాలీని రక్తి కటించారు ..

**కేసీఆర్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి**

అనంతరం బీఆర్ యస్ పార్టీ కార్యాయలంలో సర్పంచులను సన్మానించి ప్రసంగిస్తూ గ్రామాల అభివృద్ధికి సర్పంచులు పనిచేయాలని అన్నారు ..గ్రామాలూ కాస్తే కూస్తో అభివృద్ధి చెందాయంటే అది కేసీఆర్ హయాంలో నేనని అన్నారు .. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు ..కోర్ట్ మొట్టికాయలు వేస్తె తప్ప గ్రామా పంచాయతీల ఎన్నికలు పెట్టెలదని ఇంట చేతగాని ,దద్దమ్మ ప్రభుత్వాన్ని గతంలో ఎన్నడూ చెందలేదని ప్రభుత్వ విధానాలను కేటీఆర్ దుయ్యబట్టారు .. సీఎం రేవంత్ రెడ్డికి తిట్లపై ఉన్న శ్రద్ద అభివృద్ధిపై లేదని ధ్వజమెత్తారు ...నీటి వాటా గురించి అడిగితె లేని పోనీ పొంతనలేని లెక్కలు చెపుతున్నారని అన్నారు ...కృష్ణా ,గోదావరి నదులపై ఏ ఏ ప్రాజెక్టులు ఉన్నాయనేది తెలియని అజ్ఞానమైన ముఖ్యమంత్రి కేసీఆర్ పై విమర్శలు చేయడం విడ్డురంగా ఉందని దుయ్యబట్టారు ..

అంతకు ముందు మార్గమధ్యలో నాయకునిగూడెం టోల్ ప్లాజా వద్ద జరిగిన ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు ...ఆయన్ను కలిసేందుకు , షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు యువకులు పోటీపడ్డారు ...కేటీఆర్ చిరునవ్వుతోనే అందరికి షేక్ హ్యాండ్ ఇస్తూ అభివాదాలు చెప్పారు ..కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు ,మాజీ మంత్రి పువ్వాడ అజయ్ , మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు , మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య , కందాల ఉపేందర్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు ..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్ల గూడెం,సింగరేణి పల్లి టోల్ ప్లాజా వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు బుధవారం ఉదయం ఖమ్మం వెడుతూ మార్గ మధ్యంలో కొద్ది సేపు ఆగి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డిలతో కలిసి టీ తాగారు.ఈ సందర్భంగా స్థానికులు పెద్ద సంఖ్యలో కేటీఆర్ తో ఫోటోలు దిగారు.

# గురుకులాల అప్లికేషన్‌లకు అండగా లావణ్య శివకృష్ణ

- ఉచిత ఆన్లైన్ సేవలతో పేద విద్యార్థులకు భవిష్యత్తు బాట
- గురుకులాల అప్లికేషన్ సేవలు పూర్తిగా ఉచితం
- గ్రామీణ, పేద విద్యార్థులకు పెద్ద ఊరట
- అభినందించిన బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి, కొండ

**ఖమ్మం బ్యూరో ,జనవరి 07(తెలంగాణ ముచ్చట్లు)**

బోనకల్ గ్రామంలోని పేద మరియు మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో ప్రవేశం పొందాలనే లక్ష్యంతో, బోనకల్ గ్రామపంచాయతీ 9వ వార్డు మెంబర్ లావణ్య శివకృష్ణ దంపతులు గురుకులాల అప్లికేషన్ ఆన్లైన్ సేవలను పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం ఆన్లైన్ విధానం తప్పనిసరిగా మారడంతో, కంప్యూటర్ అవగాహన లేకపోవడం, ఇంటర్నెట్ సదుపాయాల కొరత కారణంగా అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గమనించిన లావణ్య శివకృష్ణ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తన స్వంత ఖర్చులతో సేవలు అందిస్తున్నారు.
అప్లికేషన్ ఫిల్లింగ్, సర్టిఫికెట్ల అప్‌లోడ్, ప్రింట్ అవుట్ వంటి అన్ని ప్రక్రియలను ఎలాంటి ఫీజు తీసుకోకుండా నిర్వహిస్తూ, విద్యార్థులు ఎలాంటి పొరపాట్లు లేకుండా దరఖాస్తు చేసుకునేలా మార్గనిర్దేశం చేస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ సేవల ద్వారా అధికంగా లాభపడుతున్నారు. రోజూ



పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు లావణ్య శివకృష్ణ వద్దకు వచ్చి అప్లికేషన్‌లు చేయించుకుంటూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.
ఈ సందర్భంగా బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ కొండ మాట్లాడుతూ... లావణ్య శివకృష్ణ దంపతులు చేస్తున్న ఈ సేవల వల్ల పిల్లలకు మంచి విద్యా భవిష్యత్తు దక్కే అవకాశం కలిగిందని , ఇలాంటి సేవా కార్యక్రమాలు చేసే ప్రతి ఒక్కరికి గ్రామపంచాయతీ పరకవర్గం అండగా నిలుస్తుందని, ఈ సేవ కార్యక్రమం ద్వారా విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చక్కగా చదివి మంచి ర్యాంకులు సాధించి ఉద్యోగ అవకాశాలు రాబట్టుకోవాలని కోరుతూ లావణ్య శివకృష్ణ దంపతులను అభినందించారు.
లావణ్య శివకృష్ణ దంపతులు చేస్తున్న సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటున్నా విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజలు లావణ్య శివకృష్ణ దంపతులను అభినందిస్తూ, ఇలాంటి సేవాభావం కలిగిన వారు సమాజానికి ఆదర్శమని కొనియాడుతున్నారు.

# చలి రాత్రిలో వికసించిన మానవత్వం

**ఖమ్మం బ్యూరో, జనవరి 7 (తెలంగాణ ముచ్చట్లు)**

ఆ రోజు రాత్రి చలి పులిలా పంజా విసురుతోంది. నగరం అంతా దుప్పట్లు కప్పుకుని ముసుగు తన్ని నిద్రపోతోంది. కానీ, రషీద్‌కి మాత్రం నిద్ర పట్టడం లేదు. తన వెచ్చని పరుపు మీద పడుకున్నా, కిటికీ గుండా బయట వినిపిస్తున్న గాలి హోరు అతన్ని కలవరపెడుతోంది.
అతనికి ఈ రోజు మసీదులో విన్న మాటలు గుర్తొస్తున్నాయి. "మనం సౌకర్యంగా ఉన్నప్పుడు చలిని కేవలం ఒక అసౌకర్యంగా భావిస్తాం, కానీ ఏమీ లేని అభాగ్యులకు ఇది ఒక ప్రాణ సంకటమైన పరిస్థితి". ఒక ముస్లిం తాను సుఖంగా ఉంటూ, తన పొరుగువాడు చలితో వణుకుతుంటే అతని విశ్వాసం (ఈమాన్) కేవలం ఒక మాటగానే మిగిలిపోతుందన్న



హెచ్చరిక అతని చెవుల్లో మారుమోగుతోంది.
రషీద్ లేచి తన బీరువా తెరిచాడు. అందులో తను ఎంతో ఇష్టపడి కొనుక్కున్న కొత్త కంబళ్లు, వెచ్చని కోట్లు ఉన్నాయి. ఖురాన్ వాక్యం అతనికి గుర్తుకు వచ్చింది: "మీకు అత్యంత ప్రియమైన వస్తువులను దానం చేయనంత వరకు మీరు పుణ్యాన్ని పొందలేరు". ఇది కేవలం ఒక ఉపకారం కాదు, ఆ అభాగ్యుల హక్కు అని అతను గ్రహించాడు.
వెంటనే తన స్నేహితులకు ఫోన్ చేసి ఒక చిన్న బృందంగా ఏర్పడ్డాడు. వారు తమ ఇళ్లలో ఉన్న అదనపు దుప్పట్లను, స్వెటర్లను సేకరించారు. ఇది కేవలం ఒక భావోద్వేగం కాదు, ఒక సామాజిక బాధ్యత అని వారు నమ్మారు.

**వారు నగర వీధుల్లోకి వెళ్ళినప్పుడు:**

ఫుట్‌పాత్‌పై పాత గోనె సంచీ కప్పుకుని వణుకుతున్న ఒక వృద్ధుడిని చూశారు.
చిరిగిన బట్టలతో తల్లిని హత్తుకుని పడుకున్న పసిపిల్లలను గమనించారు.
చలి గాలికి రక్షణ లేని ఆశ్రయాల్లో తలదాచుకున్న కూలీలను కలిశారు.
రషీద్ తన చేతులతో ఆ వృద్ధుడికి వెచ్చని కంబళి కప్పుతున్నప్పుడు, ఆ వృద్ధుడి కళ్ళలో కనిపించిన కృతజ్ఞత అతనికి ఎనలేని తృప్తిని ఇచ్చింది. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్పినట్లు, "ఎవరు తన సోదరుని అవసరాన్ని తీరుస్తారో, అల్లాహ్ వారి అవసరాన్ని తీరుస్తాడు" అన్న మాట నిజమని అతనికి అనిపించింది.
ఆ రాత్రి వారు కేవలం బట్టలు మాత్రమే పంచలేదు, మనుషుల మధ్య తెగిపోతున్న అనురాగ బంధాన్ని మళ్ళీ అతికించారు. చలికాలం కేవలం వాతావరణ మార్పు కాదు, అది మనలోని మానవత్వాన్ని మేల్కొలిపే ఒక అవకాశం అని వారు నిరూపించారు.
నీతి: సేవ అనేది కేవలం డబ్బు ఇవ్వడం కాదు, అవతలి వ్యక్తి బాధను మన బాధగా అనుకోవడం. ఈ శీతాకాలంలో మన చుట్టూ ఉన్న ఏ ఒక్కరూ నిరాశ్రయులుగా ఉండకూడదని సంకల్పం చేద్దాం.

## జయగిరి పాఠశాలలో క్యాలెండర్ ఆవిష్కరణ

**హసన్ పర్తి, జనవరి 07,( తెలంగాణ ముచ్చట్లు):**

హసన్ పర్తి మండలం జయగిరి గ్రామంలోని పాఠశాలలో క్యాలెండర్ ఆవిష్కరణ నిర్వహించారు. అదేవిధంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ తాళ్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్,ఉప సర్పంచ్,వార్డు మెంబర్లను పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు సన్మానించారు,ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## కుషాయిగూడలో ఫంక్షన్ హాల్ యజమానులతో పోలీసులు సమావేశం

- రాత్రి 10 తర్వాత శబ్ద కాలుష్యం, బాణాసంచాపై కఠిన చర్యలు: పోలీసులు

**కుషాయిగూడ, జనవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లిమిట్స్‌లో ఉన్న అన్ని ఫంక్షన్ హాళ్ల యజమానులు, మేనేజర్స్ తో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాత్రి 10 గంటల తర్వాత ఎలాంటి శబ్ద కాలుష్యం జరిగినా, నిబంధనలకు విరుద్ధంగా బాణాసంచా కాల్చినా చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు.ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా శబ్ద నియంత్రణ నిబంధనలను పాటించాలని సూచించారు. అనుమతులు లేకుండా డీజేలు వినియోగించడం, నిషేధిత సమయాల్లో లౌడ్ స్పీకర్లు ఉపయోగించడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి పాల్గొని, చట్టాలు, నిబంధనలపై ఫంక్షన్ హాల్ యజమానులు,మేనేజర్స్‌కు అవగాహన కల్పించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని వారు కోరారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## సత్తుపల్లి అభివృద్ధిపై ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే భేటీ

- తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సీఎంను కలిసిన ప్రజాప్రతినిధులు

**సత్తుపల్లి, జనవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, పరిష్కరించాల్సిన సమస్యలు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలపై ముఖ్యమంత్రితో విస్తృతంగా చర్చించారు. సత్తుపల్లి ప్రజలకు మరింత మేలు కలిగేలా ప్రభుత్వ సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువ నాయకుడు తుమ్మల యుగంధర్, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అదేవిధంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహాను సెక్రటేరియట్‌లోని వారి ఛాంబర్‌లో సత్తుపల్లి ఎమ్మెల్యే, డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో కల్లూరులో ఏర్పాటు చేస్తున్న ఆసుపత్రుల ప్రారంభోత్సవం, అలాగే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దీనిపై మంత్రి దామోదర్ రాజా నర్సింహా సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే సంబంధిత అంశాలపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## బీ. ఆర్ ఎస్ పార్టీకి ఎదురు దెబ్బ

- మంత్రి తుమ్మల సమర్థ నాయకత్వంలో పనిచేసేందుకు కాంగ్రెస్ గూటికి 8 మంది కార్పొరేటర్లు
- బుధవారం సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ముగ్గురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిక
- మంత్రి తుమ్మల మరియు కార్పొరేటర్లను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి



**ఖమ్మం బ్యూరో, జనవరి 7(తెలంగాణ ముచ్చట్లు)**

బీ.ఆర్.ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.హైదరాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో మంత్రి తుమ్మల వెంట వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

33 వ డివిజన్ కార్పొరేటర్ తోట ఉమారాణి వీరభద్రం 34 వ డివిజన్ కార్పొరేటర్ రుద్రగాని శ్రీదేవి ఉపేందర్ 17 వ డివిజన్ కార్పొరేటర్ ధనియాల రాధ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని మరియు కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు.

**ఖమ్మం అబివృద్ధి పరుగులు పెట్టాలి... సీఎం రేవంత్**

ఖమ్మం నగర అబివృద్ధి ఇక పరుగులు పెట్టాలని మంత్రి తుమ్మల అబివృద్ధి బాటలో కార్పొరేటర్లు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

**బీ.ఆర్.ఎస్ పార్టీకి బిగ్ షాక్**

రెండు రోజుల వ్యవధిలో బీ ఆర్.ఎస్ పార్టీ నుంచి 8 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ గూటికి చేరారు. సోమవారం నాడు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరగా బుధవారం నాడు సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ముగ్గురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు.పాత కొత్త కార్పొరేటర్లు అందరూ మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసారు.ఖమ్మం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్లు విజ్ఞప్తి చేయగా మంత్రి తుమ్మల నాయకత్వంలో ఖమ్మం నగరం మోడల్ గా అభివృద్ధి చెందుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## సంపద సృష్టికి పసిడిపై పెరుగుతున్న ఆసక్తి

మేలిమి బంగారం, పసిడి ఆభరణాలు.. రూపం ఏదైనా సంపద సృష్టికి పుత్తడి మంచి సాధనంగా ఉపయోపడుతుందని దేశీయ కొనుగోలుదారులు పరిగణిస్తున్నట్లు డెలాయిట్ ఇండియా నివేదిక తెలిపింది. బంగారం రూపంలో సంపదను కాపాడుకోవచ్చని గతంలో భావించేవారు. ఇప్పుడు సంపదను మరింత పెంచుకునేందుకు మ్యూచువల్ ఫండ్, స్టాక్స్ (87%)కు ప్రత్యామ్నాయంగా పసిడిని చూస్తున్న వారి సంఖ్య 86 శాతానికి చేరిందని వెల్లడించింది. 45 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసున్న వినియోగదారులు, పెట్టుబడి రీత్యా బంగారాన్ని కొనుగోలు చేయడానికి ఎక్కువ మొగ్గు చూపుతున్నట్లు పేర్కొంది. 'భారత్ ఆభరణాల విపణి కొత్త తరుణంలోకి అడుగు పెట్టింది. సంప్రదాయబద్ధంగా ధరించేందుకే పసిడిని కొనడం ఆగింది. సంపద సృష్టికి, హోదాసామాజిక స్థితిని ప్రదర్శించుకునేందుకు, రోజూ కొత్తగా కనిపించేందుకు పసిడిని వినియోగిస్తున్నారని' డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ప్రవీణ్ గోవిందు వివరించారు.

## దేశ అభివృద్ధికి యువత తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి

- ప్రస్తుత విద్యార్థులే ఫ్యూచర్ ఇండియా
- సోషల్ మీడియ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి
- విద్యార్థుల భవిష్యత్ వారి చేతుల్లోనే ఉంది
- వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య

**హన్మకొండ,జనవరి07(తెలంగాణ ముచ్చట్లు):**






హనుమకొండలోని పింగళి మహిళ డిగ్రీ కళాశాలలో భారత సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిర్వహించిన వందేమాతరం 150వ వార్షికోత్సవ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలకు చేరుకున్న ఎంపీకి విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.కార్యక్రమానికి ముందు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఏర్పాటు చేసిన వందేమాతరం, భారత రాజ్యాంగ చరిత్రను వివరిస్తున్న ఫోటో ప్రదర్శనను ఎంపీ ప్రారంభించి సందర్శించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కుల వల్లే నేడు ప్రతి ఒక్కరికీ చదువుకునే హక్కు లభించిందని తెలిపారు. ఈ గొప్ప అవకాశాన్ని దేశానికి అందించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని పేర్కొన్నారు. చదువే పేదరిక నిర్మూలనకు ప్రధాన ఆయుధమని, సమాన హక్కులు కల్పించే శక్తి విద్యకే ఉందని స్పష్టం చేశారు.వందేమాతరం గీతం స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో దేశభక్తిని రగిలించిన మహత్తర ప్రేరణగా నిలిచిందని తెలిపారు. స్వాతంత్ర్య సాధన కోసం అనేక మంది వీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. యువత దేశ చరిత్రను తెలుసుకొని, దేశ అభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.




భారతదేశం సర్వమత సమ్మేళనమని, సంస్కృతి-సాంప్రదాయాలకు నిలయమని పేర్కొన్నారు. సరోజిని నాయుడు, దుర్గాబాయి దేశ్‌ముఖ్ వంటి మహిళా నాయకుల సేవలను స్మరించుకుంటూ, ప్రతి విద్యార్థిని రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయిలను స్ఫూర్తిగా తీసుకొని ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. మహిళలు విద్యతో పాటు సామాజిక, రాజకీయ రంగాల్లో మరింత ముందుకు రావాలని అన్నారు.ప్రస్తుత విద్యార్థులే భవిష్యత్ ఇండియా అని పేర్కొన్న ఎంపీ, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. సోషల్ మీడియ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థుల భవిష్యత్ వారి చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ కోటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు, సీబీసీ అధికారులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.







## వేలేరు పాఠశాల హౌస్ హెడ్స్‌కు ప్రత్యేక యూనిఫామ్ కిట్ల పంపిణీ

**విద్యార్థుల సంక్షేమానికి, పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ బిల్లా యాదగిరి హామీ**

**వేలేరు,జనవరి07(తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ప్రత్యేక యూనిఫామ్‌తో కూడిన కిట్లను పాఠశాల హౌస్ హెడ్స్‌కు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. సత్తయ్య అధ్యక్షతన నిర్వహించగా, వేలేరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి చేతుల మీదుగా కిట్లు అందజేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొనే సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని, వాటి పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. పాఠశాల ప్రహరీ గోడను త్వరలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమం అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు సర్పంచ్‌కు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వీధికుక్కల నియంత్రణపై సుప్రీంకోర్టులో కీలక వాదనలు

**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):**



వీధికుక్కల అంశంలో వ్యతిరేక, అనుకూల వాదనలతో దాఖలైన పిటీషన్లను సుప్రీంకోర్టు బుధవారం విచారిస్తోంది. విక్రమ్ నాథ్, సందీప్ మెహతా, ఎన్.వి. అంజారియాతో కూడిన ధర్మాసనం జాతీయ రహదారులపై కలిగే భద్రతాపరమైన ఆందోళనలను ప్రస్తావించింది.

ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది, హైదరాబాద్ తరపున వాదించిన వేణుగోపాల్ కీలక వ్యాఖలు చేశారు. యూనివర్సిటీ జంతు న్యాయ కేంద్రం జంతు సంరక్షణలో మాస్టర్స్ కోర్సు , డిప్లొమాను నిర్వహిస్తుందని, హార్వర్డ్ విశ్వవిద్యాలయంతో ఒక అవగాహన ఒప్పందాన్ని కలిగి ఉందని కోర్టుకు తెలిపారు. అతని బృందం దేశవ్యాప్తంగా కుక్కల జనాభా, ఆశ్రయ అవసరాలతో సహా గతంలో సమర్పించని గణాంకాలను వెలికి తీసింది, మౌలిక సదుపాయాలు మరియు నిధులలో అంతరాలను ప్రస్తావించారు.

చట్టబద్ధమైన నియమాలను సవరించే వరకు లేదా పక్కన పెట్టే వరకు, సుప్రీంకోర్టు వాటిని విస్మరించలేదని వేణుగోపాల్ నొక్కిచెప్పారు. దీర్ఘకాలంగా ఉన్న పద్ధతులను మార్చే ముందు నిపుణుల సలహా అవసర మన్నారు. నియమాలు, ఇతర చట్టబద్ధ నియమాలను పాటించడం ప్రాధాన్యంగా ఉండాలన్నారు. ఈ విషయంలో కోర్టుకు మార్గనిర్దేశం చేయడానికి విజయవంతమైన రాష్ట్రాల నుండి పశుసంవర్ధక శాఖల అధిపతులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని వేణుగోపాల్ సమర్పించారు. ప్రస్తుత చట్టం ప్రకారం వీధి కుక్కలను వాటి అసలు స్థానాలకు తిరిగి ఇవ్వాలని, మరియు అదే స్థలంలో విడుదల చేయడాన్ని నిరోధించే ప్రస్తుత ఉత్తర్వు చట్టబద్ధమైన నియమాలను ఉల్లంఘిస్తుందని ఆయన వాదించారు.

వేణుగోపాల్ పాఠశాలల్లోని సదుపాయల లేమిని వేణుగోపాల్ ఎత్తిచూపారు, 194,412 పాఠశాలల్లో విద్యుత్, సరైన మరుగుదొడ్లు , తాగునీరు లాంటి కనీససౌకర్యాలు లేవని నివేదించారు. కుక్కలను నిరోధించేందుకు కంచెలు నిర్మించమని వీటిని కోరడం అవాస్తవికమని ఆయన వాదించారు. సౌకర్యాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కుక్కల నిర్వహణ ప్రోటోకాల్‌లను అమలు చేయడంలో ఉన్న సవాళ్లకు ఇది నిదర్శనమన్నారు.

భారతదేశంలో దాదాపు 5.25 కోట్ల వీధి కుక్కలు ఉన్నాయని వేణుగోపాల్ ధర్మాసనానికి తెలియజేశారు. ఒక్కో సౌకర్యానికి 200 కుక్కల చొప్పున వాటిని ఉంచడానికి, 77,347 షెల్టర్లు అవసరమవుతాయి, ఒక్కొక్కటి ఒక్కో కుక్కకు 40 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటాయి. ఒక కుక్కకు ఆహారం ఇవ్వడానికి రోజుకు రూ.40 ఖర్చవుతుందని, అంటే 1.54 కోట్ల కుక్కలకు ఆహారం ఇవ్వడానికి రోజుకు రూ.61.81 కోట్లు అవసరమవుతుందని, ఇది సమస్య యొక్క స్థాయిని వివరిస్తుందని ఆయన అన్నారు.




## ఒప్పో గూటికి రియల్‌మీ: సబ్‌బ్రాండ్‌గా విలీనం

ప్రముఖ చైనా మొబైల్ కంపెనీ రియల్‌మీమరో చైనీస్ కంపెనీ ఒప్పో గూటికి చేరింది. ఇకపై ఒప్పో సబ్ బ్రాండ్‌గా కార్యకలాపాలు నిర్వహించనుంది. ఈ విలీనం ద్వారా వనరులను సమర్థవంతంగా వాడుకుంటూ, మార్కెట్లో మరింత వృద్ధి చెందాలని ఇరు సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. విలీనం తర్వాత రియల్‌మీ నుంచి రావాల్సిన ఫోన్లు షెడ్యూల్ ప్రకారమే విడుదల కానున్నాయి. విక్రయానంతర సేవలు ఒప్పోలో విలీనం కానున్నాయి.

బడ్జెట్ సెగ్మెంట్‌లో షావోమీకి పోటీగా స్మార్ట్‌ఫోన్‌లను లాంచ్ చేసి గుర్తింపు తెచ్చుకున్న రియల్‌మీకి.. భారత్‌తో పాటు ఆగ్నేయాసియా, యూరప్‌లో మంచి మార్కెట్ ఉంది. ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగా తాజా నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వన్‌ప్లస్ కూడా ఒప్పో సబ్‌బ్రాండ్‌గా కొనసాగుతోంది. మరోవైపు ఒప్పో, వివో సంస్థలకు బీబీకే ఎలక్ట్రానిక్స్ సంస్థ మాతృ సంస్థగా వ్యవహరిస్తోంది. అంటే పేరుకే పోటీ కంపెనీలుగా చలామణీ అవుతున్నా.. ఒకే గ్రూప్‌నకు చెందిన కంపెనీలన్నమాట! పేర్లు వేరైనా తమ తమ మార్కెటింగ్ వ్యూహాలతో ముందుకెళుతున్నాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in